జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 93 విశాఖపట్నం | శనివారం 18 డిసెంబరు 2021 | 8 పేజీలు | వెల : 5.00

## పలు అభివృద్ధి ప్రాజెక్టులను..
# ప్రారంభించిన జగన్

విశాఖపట్నం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విశాఖపట్నంలో పర్యటించారు. రూ.248 కోట్లతో పలు అభివృద్ధి పనులను సీఎం ప్రారంభించారు.. 150 కోట్లతో నిర్మించిన ఎన్ఏడీ ఫ్లైఓవర్‌తో పాటు వీఎంఆర్‌డీఏ రూ. 36.32 కోట్లతో పూర్తి చేసిన మరో 6 ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. బీచ్‌రోడ్డులో రూ. 61. 01 కోట్లతో జీవీఎంసీ పూర్తి చేసిన 4 స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్ని సీఎం ప్రారంభించారు.వైజాగ్ కన్వెన్షన్‌లో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మనవరాలు నిహారిక, రవితేజ వివాహ రిసెప్షన్‌కు సీఎం వైఎస్ జగన్ హాజరయ్యారు. వధూవరుల్ని సీఎం ఆశీర్వదించారు. డీసీసీబీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు కుమార్తె దివ్యనాయుడు, సుభాష్ వివాహ రిసెప్షన్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరుల్ని సీఎం ఆశీర్వదించారు. విశాఖలో ఎన్ఏడీ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు.





## సమాజ ప్రగతికి..
# ఎనలేని కృషి చేస్తున్న స్నేహా సంస్థలు

**స్నేహా సంస్థల 21వ వార్షికోత్సవం లో తెలంగాణ రాష్ట్ర బిసి కమీషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్**





హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి) : బాబా సాహెబ్ అంబేద్కర్ కోరుకున్న సమాజ ప్రగతికి రెండు దశాబ్దాల నుండి స్నేహా సంస్థలు బాటలు వేస్తున్నాయన్నారు తెలంగాణ రాష్ట్ర బిసి కమీషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్.తెలుగు యూనివర్సిటీ లో జరిగిన స్నేహా సంస్థల 21వ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్పం ఉంటే శక్తి దానంతట అదే వస్తుందని దానికి ప్రతిరూపమే కటికల శివ భాగ్యారావు అన్నారు. బాబాసాహెబ్ చీకటి రోజుల్లో తాను అనుభవించిన బాధలు ఎవరూ పడకూడదని అలుపెరుగని పోరాటం చేశారన్నారు. నేటికీ ఆయన ఆలోచనలు సైద్ధాంతికంగా అమలుపరుచడంలో విఫలమవుతూనే ఉన్నామన్నారు. తాను తయారు చేసిన హిందుకోడ్ బిల్లు ఉభయసభలలో ఆమోదం పొందలేక పోవడంతో ఆయన రాజీనామా చేసిన ఘటన మరువలేనిదన్నారు. అణగారిన వర్గాల పక్షాన నిలబడి పోరాటం చేసిన అంబేద్కర్ ను ఇప్పటికీ దేవుణ్ణి చేయలేక పోవడం మన తప్పే అన్నారు. ఆయనిచ్చిన రాజ్యాధికారాన్ని మనం ఏ విధంగా ఉపయోగించుకుంటున్నామో ఆలోచించుకోవాలన్నారు.సమాజంలో మేధోమదనం జరిగి లోపాలను తొలగించి అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు.

**స్నేహా సంస్థల చైర్మన్ కటికల శివ భాగ్యారావు మాట్లాడుతూ** రోజూ పైసాపైసా కూడబెట్టుకుని సమాజ సేవ చేస్తున్నవి ఒక్క ఎన్.జి.ఓ లు మాత్రమే అన్నారు. సోషల్ (మిగతా 7లో..)

## రాజధాని రైతులు చేసిన
# పాపం ఏమిటి..?: చంద్రబాబు



తిరుపతి: రాజధాని రైతులు చేసిన పాపం ఏమిటని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించాలని కోరుతూ న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు చేపట్టిన అమరావతి రైతుల మహాపాదయాత్ర ముగింపు సందర్భంగా చిత్తూరు జిల్లా తిరుపతిలో ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు పాల్గొన్నారు. సభావేదికపై జై అమరావతి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. "అమరావతి న్యాయస్థానం నుంచి తిరుమల వరకు పాదయాత్ర చేసిన మీ అందరినీ అభినందిస్తున్నా. 45 రోజులు 450 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. అమరావతి ఉద్యమం మొదలైనప్పటి నుంచి దాదాపు 180 మంది చనిపోయారు. వేల సంఖ్యలో కేసులు పెట్టారు. ఒక్క పాదయాత్రలోనే 2,500 మందిపై వందకు పైగా కేసులు పెట్టారు. ఎస్సీలపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టిన దద్దమ్మ ప్రభుత్వం ఇది. 2014లో రైతులందరూ ఆలోచించి రాజధాని కోసం (మిగతా 2లో..)



## ఆ నీచానికి ఫుల్‌స్టాప్ పెట్టండి: ప్రియాంక

న్యూఢిల్లీ: ''అత్యాచారాన్ని నిలువరించలేనప్పుడు దాన్ని ఎంజాయ్ చేయాలి'' అంటూ కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్ రమేష్ కుమార్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా స్పందించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించారు. "కేఆర్ రమేష్ వ్యాఖ్యలను నేను ఖండిస్తున్నాను. ఇలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా (మిగతా7లో..)

## అమరావతినే రాజధానిగా ఉంచాలి

(వివరాలు 5లో..)

# ప్రపంచ పెట్టుబడిదారులతో మోదీ సమావేశం..



ఢిల్లీ: కేంద్రం వచ్చే బడ్జెట్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో భారతదేశాన్ని మరింత ఆకర్షణీయమైన పెట్టుబడులు రాబట్టేందుకు ప్రధాన నరేంద్ర మోదీ ప్రముఖ ప్రైవేట్ ఈక్విటీ/వెంచర్ క్యాపిటల్ ప్లేయర్‌లతో సంభాషించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వ్యాపార ప్రతినిధులతో కీలక చర్చలు జరిపారు. వ్యాపారాన్ని మరింత సులభతరం చేయడానికి, ఎక్కువ మూలధనాన్ని ఆకర్షించడానికి .. సంస్కరణ ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లడానికి సూచనలు చేశారు. తదుపరి బడ్జెట్‌కు ముందు ఇన్‌పుట్‌లను సేకరించేందుకు పరిశ్రమల ప్రముఖులతో ఈ సమావేశంలో చర్చించారు. అయితే ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ 2022 ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న సమర్పించనున్నారు. గత ఏడాది నవంబర్‌లో ఆరు ట్రిలియన్ డాలర్లకుపైగా ఆదాయాలు సమకూర్చుకుంటున్న 20 మంది ప్రపంచ పెట్టుబడిదారులతో మోడీ సమావేశం అయ్యారు. అయితే 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి (మిగతా 7లో..)



## గూండాలకు వాళ్లు రక్షణ ఇస్తే, మేము ఏరివేశాం: అమిత్‌షా

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని విపక్ష పార్టీలైన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విమర్శలు గుప్పించారు. (మిగతా 7లో..)

# బీజేపీతో పొత్తు కుదిరింది : కెప్టెన్ అమరీందర్ సింగ్



న్యూఢిల్లీ : పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ నేతృత్వంలోని పంజాబ్ లోక్ కాంగ్రెస్, బీజేపీ మధ్య శుక్రవారం పొత్తు కుదిరింది. రానున్న శాసన సభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. ఈ విషయాన్ని పంజాబ్ బీజేపీ ఇన్‌ఛార్జి గజేంద్ర సింగ్ షెఖావత్, కెప్టెన్ సింగ్ ధ్రువీకరించారు. సీట్ల పంపకంపై ఇరు పార్టీల మధ్య ఇప్పటి వరకు ఏడుసార్లు చర్చలు జరిగాయి. తుది నిర్ణయం ఇంకా వెలువడలేదు. %కెప్టెన్ అమరీందర్ సింగ్, గజేంద్ర సింగ్ షెఖావత్ శుక్రవారం సమావేశమయ్యారు. రానున్న పంజాబ్ శాసన సభ ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీ చేయాలని నిర్ణయించారు. అమరీందర్ సింగ్ ఇచ్చిన ట్వీట్‌లో, తాను షెఖావత్‌తో న్యూఢిల్లీలో సమావేశమయ్యానని తెలిపారు. 2022లో జరిగే పంజాబ్ శాసన సభ ఎన్నికల కోసం తాము బీజేపీతో సీట్ల సర్దుబాటు కోసం అధికారికంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి స్థానాన్ని పరిశీలించి, పరిస్థితులనుబట్టి ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలో నిర్ణయించుకుంటామని తెలిపారు. గెలుపే ప్రధాన లక్ష్యంగా ఈ పంపకాలు ఉంటాయన్నారు. ఈ ఎన్నికల్లో తమ కూటమి విజయం సాధిస్తుందని 101 శాతం నమ్మకం ఉందన్నారు.

PAY BACK TO SOCIETY · SNEHA CLUB
స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్
SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com





# చిన్న పత్రికల అంటే చులకనా..? - హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ ఛైర్మన్ షేక్. ఖలీఫాతుల్లాబాషా

ఒంగోలు : చిన్న పత్రికల అంటే చులకనా. ?,పాత్రికేయులను పట్టించుకోని ప్రభుత్వం అక్రిడేషన్‌లు లేవు, రాయితీలు లేవు, ఇదెక్కడి న్యాయం జగన్ సారూ..? అంటూ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ ఛైర్మన్ షేక్. ఖలీఫాతుల్లాబాషా ప్రశ్నించారు. ఒంగోలు నగరంలోని,రెడ్ క్రాన్ సమావేశమందిరంలో జరిగిన, ఆంధ్రఎడిటర్స్, జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంకు, ప్రకాశం జిల్లా అడిషనల్ ఎస్పీ బి.రవిచంద్రతో పాటు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ ఛైర్మన్ షేక్. ఖలీఫాతుల్లాబాషా ముఖ్యఅతిథిగా హాజరై, నూతనకమిటీని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం రాకముందే,స్థానిక పత్రికలని ఏర్పాటుచేసిన ఘనత, కీర్తిశేషులు మన ప్రకాశం పంతులు కే దక్కుతుందన్నారు. స్థానిక సమస్యలను వెలుగుతీసి, ప్రజలకు న్యాయంఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం రాకముందే,స్థానిక పత్రికలని ఏర్పాటు చేసిన ఘనత, కీర్తిశేషులు మన ప్రకాశం పంతులు కే దక్కుతుందన్నారు. స్థానిక సమస్యలను వెలుగు తీసి, ప్రజలకు న్యాయం జరగటానికి,అక్కడి సమస్యల పరిష్కారానికి, ప్రధానభూమిక పోషించేవని అన్నారు. కాలంతో పాటు, ఎలక్ట్రానిక్ మీడియా రావడంతో,స్థానిక చిన్నపత్రికల మనుగడ కష్టమైందన్నారు. దానితో బాటు ప్రకృతివైపరీత్యాలు కరోనా విలయతాండవం చేసన్తూ, అతలాకుతలం చేస్తున్న ఈ సమయములో, చిన్న పత్రికల సంపాదకులను ఆదుకోవాల్సిన, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ, జర్నలిస్టులకు రావలసిన ప్రభుత్వరాయితీలను కూడా, ఇవ్వడానికి అనేక షరతులు పెట్టి, రాయితీలను ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఎవరైనాఉన్నారంటే, వారు జర్నలిస్టుల అనేలా పరిస్థితి ఏర్పడింది అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కరోనాని దృష్టిలోపెట్టుకొని, జర్నలిస్టులను ఆదుకోవాలని కోరారు. స్థానిక పత్రికల సంపాదకులకు 6సంవత్సరాల సినియార్టీనిబట్టి గౌరవిస్తూ, ఎటువంటి షరతులు లేకుండా, ప్రతిసంవత్సరం అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. జరగటానికి, అక్కడి సమస్యలపరిష్కారానికి, ప్రధానభూమిక పోషించేవని అన్నారు. కాలంతోపాటు, ఎలక్ట్రానిక్ మీడియా రావడంతో,స్థానిక చిన్నపత్రికల మనుగడ కష్టమైందన్నారు. దానితో బాటు ప్రకృతివైపరీత్యాలు కరోనా విలయతాండవం చేసన్తూ, అతలాకుతలం చేస్తున్న ఈ సమయములో, చిన్న పత్రికల సంపాదకులను ఆదుకోవాల్సిన, రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ, జర్నలిస్టులకు రావలసిన ప్రభుత్వరాయితీలను కూడా ఇవ్వడానికి అనేక షరతులు పెట్టి, రాయితీలను ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఎవరైనాఉన్నారంటే, వారు జర్నలిస్టులనేలా పరిస్థితి ఏర్పడింది అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కరోనాని దృష్టిలో పెట్టుకొని, జర్నలిస్టులను ఆదుకోవాలని కోరారు. స్థానిక పత్రికల సంపాదకులకు, 6 సంవత్సరాల సినియార్టీని బట్టి గౌరవిస్తూ, ఎటువంటి షరతులు లేకుండా, ప్రతి సంవత్సరం అక్రిడేషన్‌కార్డులు మంజూరు చేయాలని, ముఖ్యమంత్రిని కోరారు. అనునిత్యం శ్రమిస్తూ, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి, వాటిని పరిష్కరించేందుకు, కృషి చేసే పాత్రికేయులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. వారికి చేయూతను అందించాల్సింది పోయి, ప్రభుత్వపరంగా రావాల్సిన రాయితీలు అక్రిడిడేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం కడుశోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, పాత్రికేయులకు తగిన న్యాయం చేయడంతోపాటు, వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ఆలోచించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సీనియార్టీని బట్టి తక్షణమే ప్రభుత్వం అందించే రాయితీలను అందించడంతోపాటు,అక్రిడేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్. కరిముల్లాను అభినందిస్తూ, చిరుసన్మానం చేసి సత్కరించారు.

## పాదయాత్రకు మద్దతుగా సంఘీభావయాత్రలు, ర్యాలీలు

### బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి



పర్చూరు(ఒంగోలు) : అమరావతి రైతుల పాదయాత్రకు మద్దతుగా , తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు పిలుపు మేరకు, బాపట్ల పార్లమెంట్ పరిధిలోని, అన్ని నియోజకవర్గాల్లో సంఘీభావ యాత్రలు నిర్వహించాలని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపుమేరకు,యద్దనపూడి మండలం జాగర్లమూడి లో అమరావతి రైతుల మహా పాదయాత్రకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, ప్రజాసంఘాలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజధాని రైతులు చేసిన పాపం ఏమిటి..?: చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

పంట భూములు ఇచ్చారు. హైదరాబాద్ అనుభవం ఉందని చెప్పి భూములు తీసుకున్నాం. జగన్ ఎన్నికల ముందు ఏం చెప్పారు? అసెంబ్లీలో ఏం చెప్పారు? ప్రాంతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టడం నాకిష్టం లేదు.. రాజధానిగా అమరావతి ఉండాలని చెప్పారు. ఎన్నికల ముందు ఏం చెప్పారో గుర్తు తెచ్చుకోవాలి. మడమతిప్పనన్న జగన్.. అమరావతిపై ఎందుకు మాట తప్పారు? అమరావతిపై కుల ముద్రవేస్తున్నారు. ఇక్కడికి వచ్చిన వారందరిదీ ఏ కులం? జగన్ ఇష్టానుసారం చేస్తే కుదరదు. అమరావతి ఏ ఒక్కరిదో కాదు... ప్రజలు కోరుకున్న ప్రజా రాజధాని. అమరావతి మునిగి పోతుందని దుష్ప్రచారం చేశారు. మూడేళ్లలో ఎప్పుడైనా మునిగిందా? అమరావతిలో భూమి గట్టిది కాదన్నారు.. హైదరాబాద్ కంటే గట్టి నేల అని చెన్నై ఐఐటీ నిపుణులు తేల్చారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని అపోహలు సృష్టించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరగలేదని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. వేంకటేశ్వరస్వామి సాక్షిగా చెబుతున్నా... ధర్మ పోరాటంలో అంతిమ విజయం మనదే. త్యాగం, పోరాటం అమరావతి రైతులది. వారి త్యాగం 5కోట్ల ఆంధ్రుల కోసమే" అని చంద్రబాబు స్పష్టం చేశారు. "అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు .. అమరావతి రైతుల భూముల్లోనే ఉన్నాయి. రాజధానికి నిధులు లేవని జగన్ అంటున్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా అమరావతిని అభివృద్ధి చేయొచ్చు. అమరావతి భూములతోనే ఆర్థిక వనరులు సమకూర్చుకోవచ్చు. అమరావతిపై ఇప్పటికే రూ. 10వేల కోట్లు ఖర్చు చేశాం. అభివృద్ధి అన్ని ప్రాంతాల్లో కావాలి... రాజధాని మాత్రం అమరావతిలో ఉండాలి. అమరావతిని కాపాడుకోవాల్సిన బాధ్యత 5కోట్ల ఆంధ్రులదే. అమరావతి రైతుల పోరాటం చరిత్రలో నిలిచిపోతుంది. రాజధాని రైతుల త్యాగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా" అని చంద్రబాబు అన్నారు. అమరావతి ఉద్యమానికి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఇచ్చిన రూ. 5లక్షల విరాళాన్ని చంద్రబాబు చేతుల మీదుగా అమరావతి జేఏసీ ఛైర్మన్ శివారెడ్డికి అందజేశారు.

# రిటైర్డ్ ఎంప్లాయిస్ కి అండగా ఉంటా: శాసనసభ్యులు కరణం బలరాం




చీరాల(ఒంగోలు) :"పెన్షనర్స్ డే" సందర్భంగా, చీరాల యూనిట్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగులు,ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో, కోడూరి ఏకాంబరేశ్వరరావు ,బత్తుల బ్రహ్మ రెడ్డి, దామర్ల బావయ్య ల అధ్యక్షతన, బావనమ్మ కళ్యాణమండపం లో జరిగిన కార్యక్రమంలో, శాసనసభ్యులు కరణం బలరామకృష్ణ మూర్తి, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాస రావు మరియు శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి. డాక్టర్ తాడివలస దేవరాజు, లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. యూనియన్ సీనియర్ సభ్యులకు సన్మాన చేశారు. చీరాల శాసనసభ్యులు కరణం బలరాంకృష్ణమూర్తి మాట్లాడుతూ, సభలో ఉన్న రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులు, కొన్ని లక్షల మందికి విద్యాబుద్ధులు నేర్పి, ఉన్నతస్థానానికి ఆ విద్యార్థి వెళ్లేందుకు, చేసినటువంటి ఉపాధ్యాయుల కృషి ఎంతో విలువైందని, ఇక్కడ ఉన్నటువంటి రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరితో మంచి అనుబంధం ఉందని, అందరికీ ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ వారికి, చీరాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ప్రతి విషయంలో కూడా సహకరిస్తామని తెలిపారు. డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు అవసరమైనటువంటి, ఈ. హెచ్. ఎస్. వైద్యసేవలు జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ ,ఆర్థోపెడిక్ ,ఈఎన్టి, యూరాలజీ ,నెఫ్రాలజీ వైద్య సేవలు శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ లో ఉన్నవని, అసోసియేషన్ సభ్యులు అందరికీ,ఆరోగ్య పరంగా ఎప్పుడు చేదోడువాదోడుగా ఉంటానని, మరియు 24 గంటలు అత్యవసర సమయాల్లో, వైద్యసేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్ బాబు ,కౌన్సిలర్లు మామిడాల. శ్రీరాములు,చీమకుర్తి బాలకృష్ణ, ఉల్లిపాయలసుబ్బయ్య, గుంటూరు ప్రభాకర్రావు, కంపా అరుణ్, గోలి జగదీష్, కో ఆప్షన్‌సభ్యులు కబీర్, వైసిపి నాయకులు,గోశాల అశోక్,చీరాల రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు శివ ప్రసాదరావు , వెంకటేశ్వర రెడ్డి ,మార్కాపురం వెంకటరామారావు ,తెలప్రోలు రమేష్ ,నాగమాంబ , మురళి మోహన్ రావు ,పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆర్.బి.కె.ల ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలి: జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్

ఒంగోలు : రైతు భరోసా కేంద్రాల ద్వారా, రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేయవలసిందిగా, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పథకాల గురించి జిల్లాలోని రైతులందరికీ అవగాహన కలిగించేలా,అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం ఉదయం ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో, ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. తొలుత వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యల గురించి సభ్యులకు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కొన్ని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు సరైన సమయంలో విత్తనాలు, ఎరువులు సరఫరా జరగడం లేదని రైతుల వద్ద నుండి ఫిర్యాదులు అందుతున్నందున అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జంగిల్ క్లియరెన్స్ గురించి మాట్లాడుతూ కేవలం ప్రభుత్వ నిధుల పైనే ఆధారపడకుండా ఆయా ప్రాంతాలలోని ఆయకట్టు రైతుల సహకారం తీసుకోవాలన్నారు. వారి నుండి విరాళాలను సేకరించి జంగిల్ క్లియరెన్స్ చేయించవలసినదిగా ఇరిగేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖలకు సంబంధించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతికి సంబంధించిన వివరాలను సలహా మండలి సభ్యులకు సంబంధిత అధికారులు వివరించారు. తదుపరి కందుకూరు శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి కందుకూరు మార్కెట్ యార్డులోని గోదామును ప్రైవేటు వ్యక్తులు తమ స్వప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని, వారి నుంచి అద్దె వసూలుచేసి అద్దెను ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు. కందుకూరు డివిజన్‌లో దాదాపు 1700 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించారని, బ్యాంకుల ద్వారా రుణాలు పొంది రొయ్యల చెరువులు, ఇతర కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారని అధికారులకు వివరించారు. ఆక్రమణలు తొలగించాలని తద్వారా ఆదాయం పొందుతూ ప్రభుత్వానికి నష్టం కలుగజేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. తదుపరి జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆళ్ల రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ గతంలో పశుసంవర్ధక శాఖ ద్వారా రూ. 250 లకు పశువుల దాణా సరఫరా చేసేవారని దాన్ని కొనసాగించాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బలవర్ధకమైన దాణా పశువులలో పాల శాతం పెరగడంతో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. వీటిని పశుసంవర్ధక శాఖ ద్వారా సరఫరా చేయాలని రైతులు కోరుతున్న విషయాన్ని జిల్లా కలెక్టరు దృష్టికి తెచ్చారు గ్రామాలలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని డెప్యుటేషన్ ద్వారా అయిన భర్తీ చేయవలసిందిగా జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆర్.బి.కె.ల నుండి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందడం లేదని రైతులు ఫిర్యాదు చేస్తున్నారని ఆయనకు వివరించారు. ఆర్.బి.కె.ల స్థాయిలో అడ్వయిజరీకమిటీ మీటింగ్‌లు జరగడం లేదన్నారు. ఆర్.బి.కె.లలో మరుగుదొడ్లు వసతి లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ కు తెలిపారు. వ్యవసాయ శాఖ రూపొందించిన గోడ పత్రాలను సలహా మండలి ఛైర్మన్ ఆళ్ల రవీంద్ర రెడ్డి, కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎం.ఎల్.ఏ. మహీధర్ రెడ్డి కలిసి విడుదల చేశారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టరు జె.వి.మురళి (ఆర్ బి. అండ్ ఆర్), వ్యవసాయ శాఖ జె.డి. శ్రీనివాసరావు, ఏ.పి.ఎం.ఐ.పి. పి.డి. రవీంద్రబాబు, ఉద్యానవనశాఖ ఏ.డి. నాగబాబు, మార్కెటింగ్ శాఖ ఏ.డి. ఉపేంద్రకుమార్, మత్స్యశాఖ జె.డి. చంద్రశేఖర రెడ్డి, పశుసంవర్ధకశాఖ జే.డి. బేబిరాణి, డ్వామా పి.డి. సీనారెడ్డి, నాబార్డు డి.డి.యం. వెంకట రమణ, ఎల్.డి.యం. యుగంధర్ రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.




# భవిష్యత్తు భారతీయ జనతా పార్టీ దే...



ఒంగోలు : ఒంగోలు పార్లమెంటు జిల్లా అధ్యక్షునిగా భారతీయ జనతా పార్టీ బలోపేతానికి శ్రీనివాస రావు చేస్తున్న కృషి ప్రశంసనీయమని బీజేపీ మైనారిటీ మోర్చా ఫార్మేర్ రాష్ట్ర అధ్యక్షుడు,హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ ఛైర్మన్ షేక్. ఖలీఫాతుల్లాబాషా అన్నారు బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో, నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందిస్తూ, వారిని సన్మానించారు. అనంతరం ఖలీఫాతుల్లాబాషా మాట్లాడుతూ, బిజెపి ఒంగోలు పార్లమెంటు జిల్లాఅధ్యక్షులు ఎస్. శ్రీనివాసరావు నేతృత్వంలో, బిజెపిని మరింత బలోపేతంచేసి, రాబోయే ఎన్నికల్లో బిజెపిని గెలిపించాలి అన్నారు. భవిష్యత్తు భారతీయజనతాపార్టీదే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీ ఒంగోలు పార్లమెంటు జిల్లా అధ్యక్షులు యస్. శ్రీనివాసరావు అధ్యక్షతన, కొత్తగా ఎన్నికైన రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ మెంబర్లను,మరియు బీజేపీ ఒంగోలు పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షుడిని, మైనారిటీమోర్చా జిల్లా అధ్యక్షుడిని,యువమోర్చా జిల్లా అధ్యక్షుడిని,మరియు మరికొంతమందిని ప్రకటించిన నేపథ్యంలో, యస్. శ్రీనివాసరావు నాయకత్వంలో, ఒంగోలు పార్లమెంటు జిల్లాలో బీజేపీ పార్టీని బలోపేతం చేసేందుకు, శాయశక్తులా కృషి చేస్తున్న సోదరులు యస్. శ్రీనివాసరావు కు అభినందనలు తెలుపుతూ,కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారిని, చిరు సత్కారంతో బాటు, వారిని బీజేపీ మైనారిటీ మోర్చా ఫార్మేర్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్. ఖలీఫాతుల్లాబాషా అభినందించారు.

## పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఖలీఫాతుల్లా భాషా



ఒంగోలు : పవర్ స్టార్ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ని, బీజేపీ మైనారిటీ మోర్చా ఫార్మేర్ రాష్ట్ర అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా రీజియన్ ఛైర్మన్ షేక్. ఖలీఫాతుల్లా బాషా,మరియు ఆయన తనయుడు ఆదిల్ ఇన్నోవేషన్ క్లబ్ డైరెక్టర్ షేక్. అహీత్ లు,మర్యాదపూర్వకంగా కలిశారు. ఖలీఫా సోదరుడైన,జనసేనపార్టీ ప్రకాశంజిల్లా అధ్యక్షుడు షేక్. రియాజ్ తో కలసి, మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా ఖలీఫా తుల్లా భాషా, ఆయన తనయుడు అహీత్‌లు, చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అడిగి తెలుసుకుని, వారిని జనసేన పార్టీ అధినేత పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ భుజం తట్టి అభినందించారు.



## ఘరానా దొంగ అరెస్ట్: డి ఎస్ పి ప్రసాద్



కావలి డిశంబర్ 17 ప్రజాపాలన ప్రతినిధి :రాష్ట్రవ్యాప్తంగా 100 దొంగతనాలకు పాల్పడిన ఘరానా దొంగ నాగసాయిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసునూరు సమీపంలో నాగ సాయి ని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. సుమారు 10 లక్షల విలువ చేసే 212 గ్రాముల బంగారం, 315 గ్రాముల వెండి ని స్వాధీనం చేసుకున్నట్లు వివరాలు వెల్లడించారు. ఇతను విశాఖపట్టణంలోని గాజువాక సెంటర్ లో ఉంటారని సుమారు దొంగతనాలకు పాల్పడిన ట్లు తెలియజేశారు. 2007 నుంచి దొంగతనాలకు పాల్పడుతున్న గా సుమారు పది సార్లు అరెస్టయి జైలుకు వెళ్లి వచ్చి మరల తిరిగి చోరీలు చేస్తున్నట్లు తెలియజేశారు. చిత్తూరు పోలీసులు అరెస్టు చేయగా జూలై నెలలో బయటకు రాగా నెల్లూరు జిల్లాలో 12 చోరీలకు పాల్పడినట్లు చెప్పారు. కావలి, నెల్లూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు చెప్పారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ ఖాజావలి, ఎస్ఐ వెంకట్రావు పాల్గొన్నారు

# రూ.36 లక్షలతో గాంధీ పార్కు అభివృద్ధి: శాసనసభ్యురాలు విడదల రజిని



చిలకలూరిపేట :(ప్రజాపాలన ప్రతినిధి)పట్టణంలో దశాబ్దాలుగా పార్కులను పట్టించుకున్న నాథులే లేరని, వీటిని ఇకపై పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాబోతున్నామని శాసనసభ్యురాలు విడదల రజిని తెలిపారు. స్థానిక గాంధీ పార్కు అభివృద్ధిలో భాగంగా పలు కార్యక్రమాలకు సంబంధించి శుక్రవారం శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విడదల రజిని ముఖ్య అతితిథిగా పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిలకలూరిపేట పట్టణంలోని పార్కులను పూర్తి స్థాయిలో మార్చేయబోతున్నామని చెప్పారు. పట్టణంలో పార్కుల అభివృద్ధి అనేది దశాబ్దాల కలగా అలానే మిగిలిపోయిందని తెలిపారు. ఎప్పుడో 2017లోనే అమృత్ పథకం కింద పార్కుల అభివృద్ధికి అవకాశం వచ్చినా సరే గత పాలకులు పట్టించుకోకుండా అలానే వదిలేశారని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక ఈ రోజు అమృత్ పథకం పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయని, ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ వల్లనే సాధ్యమైందని వివరించారు.

**పార్కుల అభివృద్ధికి కృషి**

అమృత్ పథకంలో పార్కుల అభివృద్ధి కూడా ఒక భాగంగా ఉందని ఎమ్మెల్యే విడదల రజిని తెలిపారు. నిధుల సమన్య తలెత్తడంతో ప్రభుత్వంతో మాట్లాడి పనులు ప్రారంభమయ్యేలా కృషి చేశామని చెప్పారు. పట్టణంలోని గాంధీపార్కు, ఆర్టీసీ కాలనీ పార్కు, అంబేద్కర్ పార్కు ఈ మూడు పార్కులు ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. ఇప్పుడు ఈ మూడు పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఎకరం 35 సెంట్లలో ఉన్న గాంధీ పార్కు అభివృద్ధికి రూ.36 లక్షలు, 20 సెంట్లలో ఉన్న అంబేద్కర్ పార్కు అభివృద్ధికి రూ.12 లక్షలు, 22 సెంట్లలో ఉన్న ఆర్టీసీ కాలనీ పార్కు అభివృద్ధికి రూ.10లక్షలు మంజూరయ్యాయని వివరించారు. ఈ నిధులతో ఈ మూడు పార్కులను అన్ని విధాలా అభివృద్ధి చేయబోతున్నామని పేర్కొన్నారు. జంగిల్ క్లియరెన్స్, ప్లాంటేషన్ చేస్తున్నట్లు చెప్పారు. జిమ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. చిన్న పిల్లల ఆటవస్తువులు ఏర్పాటుచేస్తామని చెప్పారు. పచ్చదనాన్ని మరింత పెంచుతామని, ఆహ్లాదకరంగా మారుస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున చేపడుతోందని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలోనూ గతంలో ఎన్నడూ లేని విధంగా ముందుకు వెళుతున్నామన్నారు. నియోజకవర్గంలో తాము చేపడుతున్న అభివృద్ధి పనులే అందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవీంద్ర,డీఈఈ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని,వైస్ చైర్మన్లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వలేటి వెంకటేశ్వర్లు,మార్కెట్ యార్డ్ చైర్మన్ మద్దిరాల విశ్వనాధం,రాష్ట్ర 15 ఫైనాన్స్ కమిషన్ మెంబర్ కోట నాయక్, పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, ప్రధాన కార్యదర్శి వరాంబోంయున నాగరాజు,కొమరవల్లిపాడు సొసైటీ అధ్యక్షుడు తోట బ్రహ్మస్వాములు,కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి,చింతపల్లి విల్సన్,యడ్ల ఇందిర, ఎుల్లగార అనురాధ,నాయబ్ సైదాబి,నసీమా బేగం,అన్నపురెడ్డి శ్రీలక్ష్మి,జాలాది సుబ్బారావు,మస్తాన్ వలి,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పోలిశెట్టి మస్తాన్,బక్షు మేస్త్రీ, నాయకులు అబ్దుల్లా,షేక్ నాగూర్, సుదర్శనం వెంకయ్య,శాపా సైదావలి,ఆలోకం లక్ష్మీనారాయణ,వందుల బుల్లెబ్బాయ్,ఉప్పాల భాస్కర్,ఫ్రూట్స్ వెంకయ్య,మేకపోతుల శివ,పిడతల సాగర్,కొప్పుల శ్యామ్,మరియు పలువురు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే రామిరెడ్డి




కావలి డిశంబర్ 17 ప్రజాపాలన ప్రతినిధి : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కావలి తాలూకా పెన్షనర్ల సమావేశ భవనంలో లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని చెప్పారు. కావలి నియోజక అభివృద్ధికి ఎప్పుడూ ముందు ఉంటానని చెప్పారు. రామాయపట్నం పోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని పూర్తి ఏర్పాటుతో చాలా మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఆకుల రమణయ్య, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం: మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (ప్రజాపాలన ప్రతినిధి) :నాదెండ్ల మండలంలోని సంకురాత్రిపాడు గ్రామంలోని మెయిన్ సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం దగ్గర, నాదెండ్ల మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో "గౌరవ సభ - ప్రజా సమస్యల చర్చా వేదిక" కార్యక్రమము నిర్వహిం సారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళల మీద జరుగుతున్న దాడులు, ఆకృత్యాలు, ప్రజల ముందుకు పెట్టేందుకే ఈ గౌరవ సభ ముఖ్య ఉద్దేశమని, మహిళలు గౌరవంగా బ్రతకాలన్న, ఎటువంటి భయాలు లేకుండా ఉండాలన్నా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని తెలిపారు. వైఎస్ఆర్ సిపి ప్రభుత్వ అరాచక పాలన గురించి, అన్నపూర్ణలా ఉన్న ఆంధ్రప్రదేశ్ ని అప్పుల ఆంధ్రప్రదేశ్ గా మార్చారు అని, దిశ చట్టం కాగితాలకే పరిమితం ఆచరణలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు అని ప్రజలకు వివరించారు. వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం ఈ రెండున్నర సంవత్సరాల్లో సమయం వృధా తప్పా ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఈ ప్రభుత్వానికి ప్రజాక్షేత్రంలో రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తేళ్ళ సుబ్బారావు, మద్దూరి వీరారెడ్డి, జవ్వాజి మదన్ మోహన్, మామిళ్ళపల్లి పోతురాజు, జరినా సుల్తానా, అమరా రమాదేవి, భూ లక్ష్మి, పోపూరి లక్ష్మి, గ్రామ మహిళలు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యోగస్తులు నిరసన ర్యాలీ చేపట్టారు




చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ మెంబెర్స్ అందరూ కేంద్ర ప్రభుత్వం ఈ రానున్న శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టనున్న బ్యాంకు చట్టాల సవరణ బిల్లు ను వ్యతిరేకిస్తూ ఈనెల 16,17 న సమ్మె బాట చేపట్టారు.. ఇందులోభాగంగా పట్టణ ములోని ఉన్న అన్ని ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులు నిరసన తెలియజేస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.. ఈ బ్యాంకుల ప్రైవేటీకరణ అనేది పూర్తిగా ప్రజా వ్యతిరేకమని,దీనివల్ల సామాన్య ప్రజలకు అందే కనీస బ్యాంకింగ్ ప్రయోజనాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.అలాగే చిన్న సన్నకారు రైతులకు ,డ్వాక్రా మహిళలకు , చిరువ్యాపారులకు అందే రుణాలు ఈ ప్రైవేటీకరణ వల్ల ఎత్తివేసే ప్రమాదం ఉందని అందువల్ల ప్రజలు అందరు తమ గళం విప్పి ఈ ప్రైవేటీకరణని అడ్డుకోవాలి. స్థానిక బ్యాంకు ఉద్యోగులు యం. కిరణ్ కుమార్ డిజిసి,ఎస్బిఐ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఆదినారాయణ , అశోక్ , భాస్కర్ ,కోటా నాయక్ , శివ,తదితరులు ఈ సమ్మె లో పాల్గొన్నారు.

## జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో వృద్ధులకు చీరల పంపిణీ



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)పట్టణానికి చెందిన జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నాదెండ్ల మండలం గణపవరం చౌటుపాలెం లోని బైబిల్ ఫెయిత్ లూథరన్ చర్చి లో సెమి క్రిస్మస్ కార్యక్రమం జరిగింది. చర్చి పాస్టర్ రెవరెండ్ పి. బర్నబాస్ ప్రత్యేక క్రిస్మస్ సందేశం వినిపించారు. ఇందులో భాగంగా 50 మంది వృద్దులు మరియు వితంతు మహిళలకు సొసైటీ సభ్యులు గేరా యాకోబు,బొల్లాపల్లి అర్జున్ ఆర్థిక సహకారంతో చీరాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి చిట్టిబాబు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. సొసైటీ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సొసైటీ ప్రతినిధులను ఆయన అభినందించారు. పేదల ఆరోగ్యం, పిల్లల విద్య పై సొసైటీ ఎక్కువగా పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు దాసరి ధనలక్ష్మి, ఉపాధ్యక్షులుగేరా యాకబ్, బొల్లాపల్లిఅర్జున్, కల్లి రాజా, దోనెపూడి ఆత్మారావు, కొట్టే విశ్వ ప్రసాద్, కొండముడి కొటేశ్వరావు, బెజ్జం రవి, జెర్రిపోతుల బుల్లి బాబు, నలమాల దానయ్య వంజ మధు, మోడీ సురేష్, మౌళి తదితరులున్నారు.

## మత్స్యశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



నరసాపురం, డిసెంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి) : మత్స్య పరిశ్రమలలో చిన్నతరహా పరిశ్రమలను అభివృద్ధి చేయడం పిఎంఎఫ్ఎంఈ పథకంయొక్క ప్రధాన ఉద్దేశ్యమని శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి, పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంపై ఫుడ్ ప్రాసెసింగ్ మరియు ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులతో శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఆర్గనైజేషన్ ద్వారా అమలు జరుగుతుందని అన్నారు. ఇది ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తుందని ఈ స్కీంలో చేపలను, రొయ్యలను ఎండబెట్టి ప్యాకింగ్ చేసి అమ్ముటకు, పచ్చి చేపలను ప్యాక్ చేసి అమ్ముకోవడానికి ఫ్రీజర్ వంటి పరికరాలను ఈ స్కీమ్ ద్వారా అందించనున్నామని అన్నారు. ఈ స్కీమ్ ద్వారా రాయితీ 35 శాతం వరకు యూనిట్ విలువ 20 లక్షల రూపాయల వరకు వర్తించబడుతుందని శాసనసభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో నరసాపురం ఆర్డీయం మారుతి, ఫిషరీస్ ఎ.డి రాజ్ కుమార్, డి.ఆర్.పి కెవిజి యాదవ్ పాల్గొన్నారు.






# పంట కాలువలను ఆదునీకరించి సాగునీరు విడుదల చేయాలి



నరసాపురం, డిసెంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి) : జిల్లాలో ధాళ్వాసాగు ప్రారంభమవుతున్నా ప్రభుత్వం, సంబందిత అధికారులు ముందస్తుగా పంట కాలువలను ఆదునీకరించటం కానీ, సాగునీరు విడుధల చేసేందుకు తగుచర్యలు తీసుకోకపోవటం ధారుణమని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం డెల్టా జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెల్టాలోని అన్ని ప్రాంతాలలో పంటబోదెలను పరిశీలించిన పూడుకుపోయి, చెత్తా చెదారంతో పాడుపడి పోయాయని అన్నారు. ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం జిల్లాలో రైతాంగానికి శాపంగా మారిందని పంట కాలువలు, మురుగు కాలువలను ఆదునీకరించకపోవటంతో కొద్దిపాటి వర్షాలకు పంట మునిగి పోవటమో లేదా సాగునీరు అందక పంట ఎండి పోవడమో జరిగి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని అయన ఆవేదన వ్యక్తం చేసారు. ఒక ప్రక్క డీజిల్ రేట్లు మండిపోతుంటే ప్రస్తుతం సాగునీరు ఇబ్బందితో పలు ప్రాంతాల్లో ధాళ్వాపంట నారుమళ్ళకు ఇంజన్లద్వారా నీరు తోడుతున్నారని వెంటనే కాలువల పూడికలు తీయించి ధాళ్వాపంటకు పూర్తిస్థాయిలో సాగునీరు అందివ్వాలని ఆయన అధికారులను డిమాండ్ చేసారు.

# ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 18, డిసెంబరు 2021


## బిజెపి ద్రోహాన్ని ఎదిరించండి!

విశాఖ ఉక్కు సంఘీభావ దీక్షను గత ఆదివారంనాడు (12-12-21) మంగళగిరిలో చేపట్టిన పవన్‌కల్యాణ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ బాధ్యత వైసిపిదేనని, ఈ పార్లమెంటు సమావేశాల్లోనే వైసిపి ఎంపిలు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై ప్లకార్డులతో ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను వ్యక్తపరచాలని ఆయన తెలిపారు. అలా అంటూనే జనసేన పార్టీ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడివుంటుందని, అఖిల పక్షంతో కూర్చుని ప్రైవేటీకరణను ఆపేందుకు మావంతు ప్రయత్నం మేము చేస్తామని తెలిపారు. దీనికి ప్రతిస్పందిస్తూ వైసిపి అధికారప్రతినిధి అంబటి రాంబాబు జనసేన బిజెపికి మిత్రపక్షం గనుక స్టీల్‌ప్లాంట్ ను ప్రైవేటీకరించవద్దని జనసేనాని ఆ కేంద్ర ప్రభుత్వానికే చెప్పి గట్టిగా అడిగి ఆ ప్రైవేటీకరణను ఆపవచ్చుగదా అని అన్నారు. ''అందరూ శాఖాహారులే, కాని బుట్టలో రొయ్యలు మాత్రం కనిపించడంలేదు" అన్న నానుడి గుర్తుకొస్తోంది. విశాఖ ఉక్కును అమ్మేయడానికి నిర్ణయించినది కేంద్రంలోని మోడీ ప్రభుత్వం. ఆ మోడీ ప్రభుత్వాన్ని నిలదీసి అడగడానికి పవన్ కల్యాణ్ గాని, వైసిపి గాని సిద్ధంగా లేవు. "నువ్వంటే నువ్వు" అనుకుంటూ మోడీని నిలదీసి అడిగే పనిని మాత్రం ఎదుటివారిమీదకి నెట్టివేస్తున్నారు. ఇంకొక ప్రధాన పార్టీ తెలుగుదేశం కూడా మోడీ ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనడం లేదు. ఆనాడు డిసిఐ ని ఏవిధంగా కాపాడుకున్నామో, ఇప్పుడూ స్టీల్ ప్లాంట్ ని అదే విధంగా కాపాడుకుందాం అంటున్నారు పవన్ కల్యాణ్. ఐతే ఆనాడు డిసిఐ ని కాపాడుకోడానికి నడిపిన ఉద్యమం కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జరిగింది. అప్పుడు పవన్ కల్యాణ్ వామపక్షాలతో కలిసి బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. విశాఖ కార్మిక వర్గం యావత్తూ డిసిఐ కార్మికులకు బాసటగా నిలిచింది. ప్రజా ఉద్యమ ఒత్తిడి ముందు కేంద్రం తలొగ్గక తప్పలేదు. మరి ఇప్పుడు విశాఖ ఉక్కు పరిరక్షణ విషయంలో కూడా అదే విధంగా చేయాలంటే పవన్ కల్యాణ్ బిజెపి పట్ల తన వైఖరి ఏమిటన్నది ముందు చూసుకోవాలి కదా? ఆనాడు ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేసిందని గళమెత్తి బిజెపిని విమర్శించిన పవన్ అదే గళంతో ఇప్పుడు మోడీని ఆకాశానికెత్తుతున్నాడు. పి.ఎం కేర్స్ కు ప్రజలు వేల కోట్ల రూపాయలు విరాళాలు ఇవ్వడమే మోడీ నిజాయితీకి నిదర్శనం అంటూ నిజాయితీకి కొత్త భాష్యం సైతం చెప్పారు. ఐతే ఆ భాష్యమే కొంత తిరకాసుగా కనిపిస్తోంది. ప్రజలు వేల కోట్ల రూపాయలు పి.ఎం కేర్స్ కి విరాళాలు ఇచ్చారు. అది ప్రజల నిజాయితీకి నిదర్శనం. ఆ నిధులకు లెక్కలు చెప్పనవసరం లేదని, వాటి లెక్కలను పార్లమెంటు కూడా పరిశీలించడానికి వీలు లేదని, ఆ వివరాలను గోప్యంగా ఉంచింది మోడీ ప్రభుత్వం. లెక్కలు చెప్పకపోవడం, జవాబుదారీతనం లేకపోవడంవెనుక ఏ విధమైన నిజాయితీ పవన్ కల్యాణ్ గారికి కనిపించిందో మరి!విశాఖ ఉక్కు పరిరక్షణకు అఖిల పక్షంతో కలిసి జనసేన ఉంటుందని ప్రకటించారు. మంచిది. దానిని ఉక్కు కార్మికులు స్వాగతించారు కూడా. అయితే ఆ అఖిల పక్షంలో వైసిపి కూడా ఒక భాగంగా ఉండాలా? వద్దా? ఉక్కు కార్మికులు తమ మధ్య ఉన్న అన్ని విభేదాలనూ పక్కనబెట్టి, ఐక్యంగా పట్టుదలగా గత 300 రోజులకు పైగా పోరాడుతున్నారు. వారంతా ఈ రాజకీయ పార్టీల నుండి కోరుకుంటున్నది ఏమిటి? కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని అన్ని పార్టీలూ కలిసి ఉక్కు పరిరక్షణ కోసం పోరాడుతున్న తమకు అండగా నిలవాలని కోరుతున్నారు. ఈ పోరాటమే బిజెపి విధానానికి వ్యతిరేకం. కనుక బిజెపి మినహా తక్కిన అన్ని రాజకీయ పార్టీలూ తమకు అండగా నిలబడాలని వారు కోరుతున్నారు. అదీ అఖిలపక్ష స్ఫూర్తి అంటే. అటువంటి స్ఫూర్తిని పవన్‌కల్యాణ్ ప్రదర్శించడానికి సిద్ధమేనా? సిద్ధమే ఐతే, ముందు బిజెపి నుండి విడగొట్టుకోవాలి కదా? మోడీ భజన చేస్తూ విశాఖ స్టీలు విషయంలో మాత్రం పోరాటం చేస్తారా?ఇక ప్రధానంగా పోరాడవలసినది కేంద్ర విధానం మీద అయినప్పుడు, అందుకోసం రాష్ట్రం లోని తక్కిన పార్టీలతో కలిసి ఐక్యంగా ఉద్యమించవలసినప్పుడు, విమర్శ ప్రధానంగా ఎవరిమీద ఎక్కుపెట్టాలి ? బిజెపి మీదా ? లేక తక్కినవారిమీదా?ఉక్కు పరిరక్షణ కోసం పోరాటం చేయడానికి సిద్ధం అంటున్న పవన్ కల్యాణ్ గారికి పోరాటం మీద ఉన్న గౌరవం ఏపాటిది? ఢిల్లీలో సంవత్సరం పాటు చలిని, వానను, ఎండను, కోవిడ్ ను లక్ష్యపెట్టకుండా నిర్బంధాలను సైతం ఎదిరించి 700 మందికి ్కటగా ఉద్యమకారుల ప్రాణాలను బలిపెట్టి మోడీ మెడలు వంచి విజయం సాధించారు రైతులు. వారి పోరాటం అంతా మోడీ చేసిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగానే సాగింది. కాని పవన్ కల్యాణ్ ఆ దుర్మార్గ చట్టాలు చాలా మంచివి అంటూ మోడీ భజన చేశారు. ఇదేనా రైతు పోరాటం పట్ల ఉన్న గౌరవం ? మోడీ నిజాయితీ గొప్పది అని, మోడీ చేసిన చట్టాలు మంచివి అని కితాబులిస్తూ ఇంకోపక్క విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పోరాడతామని మీరు అంటే ఆ మాటలకు విశ్వసనీయత ఉంటుందనే అనుకుంటున్నారా?ఈ ప్రశ్నలను వైసిపి గాని, తెలుగుదేశం పార్టీ గాని అడిగే పరిస్థితిలో లేవు. ఎందుకంటే ఆ పార్టీలు కూడా రైతు చట్టాలను ఆనాడు పార్లమెంటులో బలపరిచాయి. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వంత పాడుతూనే వున్నాయి. విభజన హామీల అమలు విషయంలోగాని, రాష్ట్రాల అధికారాలపై, హక్కులపై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడి విషయంలో గాని, నిధులను ఇవ్వకుండా ఎగనామం పెట్టిన విషయంలో గాని మోడీని గట్టిగా నిలదీసే స్థితిలో అధికార వైసిపి గాని, ప్రతిపక్ష టిడిపి గాని లేకపోవడమే నేడు ఆంధ్రప్రదేశ్ దౌర్భాగ్యం.ఇంత దౌర్భాగ్యంలోనూ మనకు కనిపిస్తున్న ఆశాకిరణం విశాఖ ఉక్కు కార్మికుల ఐక్య పోరాటం. అది విజయవంతం కావాలని ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలూ కోరుకుంటున్నారు. విశాఖ ఉక్కు తెలుగువారి హక్కు. దానిని కాదన్న ప్రభుత్వాలు దిగివచ్చాయి గతంలో. ప్రజా పోరాటమే ఆ నాటి ప్రభుత్వాల మెడలు వంచింది. ఇప్పుడు కూడా అటువంటి పోరాటమే అవసరం. ఆ విధమైన పోరాటానికి అండదండలనిచ్చి తమ నిబద్ధతను రుజువు చేసుకోవలసిన రాష్ట్రంలోని పార్టీలు-ముఖ్యంగా వైసిపి, టిడిపి, జనసేన ఉక్కు ఉద్యమాన్ని తమ రాజకీయ చదరంగంలో క్రీడా ప్రాంగణంగా వాడుకోదలిస్తే తెలుగు ప్రజలు సహించరు.ఇప్పటికే ప్రత్యేక హోదా, పోలవరం, రైల్వే జోన్, కడప ఉక్కు స్థాపన, నిధుల విడుదల, విభజన హామీల అమలు, రాజధాని నిర్మాణం వంటి విషయాల్లో బిజెపి ఆంధ్ర రాష్ట్ర ద్రోహిగా నిలిచింది. విశాఖ ఉక్కు అమ్మకం ఆ ద్రోహానికి పరాకాష్ట. ఇప్పుడైనా మన తెలుగు పార్టీలు-వైసిపి, టిడిపి, జనసేన ఈ ద్రోహాన్ని ఎదిరించి ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాల కోసం నికరంగా, నిజాయితీగా నిలబడాలి.

## బీజింగ్ ఒలింపిక్స్-అమెరికా కుటిల రాజకీయం !




రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం క్రీడలను ఒక సాధనంగా వాడుకోవాలని చూడటం గర్హనీయం. చైనా లోని షిన్‌జాంగ్ రాష్ట్రంలో ముస్లిం సామాజిక తరగతి మానవ హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ అమెరికా, దాని కూటమి దేశాలు యాగీ చేస్తున్నాయి. పొద్దున లేస్తే తమకు లొంగని దేశాల మీద ఆర్థిక, దౌత్య, ఇతర ఆంక్షలను విధిస్తున్న అమెరికా, దానికి తందాన తాన అంటున్న దేశాలు చైనా మీద ప్రచార దాడి ప్రారంభించటంలో ఆశ్చర్యం లేదు. డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంలో అమెరికా ఇప్పటి వరకు సాధించిందేమీ లేకపోగా నష్టపోయింది.బీజింగ్ ఒలింపిక్స్ తుది సన్నాహాలు కూడా పూర్తి కావస్తున్నాయి. ఫిబ్రవరి నాలుగు నుంచి 20వ తేదీ వరకు జరిగే పోటీల్లో సత్తా చూపేందుకు క్రీడాకారులు ఒకవైపు సన్నద్ధం అవుతున్నారు. మరోవైపు చైనాను బదనాం చేసేందుకు అమెరికా నాయకత్వంలోని దేశాలు అంతకంటే ఎక్కువగా సిద్ధం అవుతున్నాయి. క్రీడల కంటే అంతర్జాతీయ రాజకీయాలు ఇప్పుడు ఎక్కువగా నడుస్తున్నాయి. అసలేం జరగనుంది? అమెరికా కూటమి దేశాలు తమ క్రీడాకారులను బీజింగ్ పంపుతాయట గానీ వారి వెంట రాజకీయ నేతలు, అధికారులను మాత్రం పంపవట. దీనికి దౌత్యపరమైన బహిష్కరణ అని పేరు పెట్టారు. ఆడేది క్రీడాకారులు తప్ప అధికారులు కాదు కదా! వారు వస్తే ఏంటి? రాకపోతే ఏంటి అని క్రీడా సంబంధిత వర్గాలు పెద్దగా ఆ పిలుపులను పట్టించుకోవటం లేదని వార్తలు. రాజకీయ నేతల హడావుడి మరీ ఎక్కువగా ఉంది. మీరు వస్తే ఎంత రాకపోతే ఎంత, అసలు మిమ్మల్ని రమ్మని పిలిచిందెవరు అని చైనా ప్రతినిధులు బహిష్కరణ గురించి చెప్పేవారి గాలి తీశారు. తాము ఇంతవరకు అసలు అమెరికా రాజకీయవేత్తలకు ఆహ్వానాలే పంపలేదని, అలాంటప్పుడు బహిష్కరణకు తావెక్కడని అమెరికా లోని చైనా రాయబారి ప్రతినిధి ప్రశ్నించాడు. నిర్వహించేది అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ, దానికి రాజకీయాలతో సంబంధం లేదు. ఆతిథ్య దేశం చైనా మాత్రం దీన్ని తేలికగా తీసుకోవటం లేదు. ప్రతిగా క్రీడలు పూర్తయిన తరువాత కఱ్ఱ కాల్చి ఎక్కడ పెట్టాలో అక్కడ వాత పెడతాం అన్నట్లుగా హెచ్చరించింది. ఏం జరుగుతుందో అని ప్రపంచమంతా ఎదురు చూస్తోంది. ఎన్ని దేశాలు అమెరికాను అనుసరిస్తాయి, ఎన్ని తిరస్కరిస్తాయో ఇంకా తెలియదు. ఇప్పటి వరకు అమెరికాతో పాటు కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, లిథువేనియా బహిష్కరణ నిర్ణయాన్ని ప్రకటించాయి. జపాన్ ఇంకా ప్రకటన చేయలేదు గానీ అలాంటి సూచనే చేసింది. అమెరికా అడుగులో అడుగు వేసే దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ ఆ బాటలో నడిచేది లేదని చెప్పేశాయి. పంపటం లేదని, తమది బహిష్కరణ కాదంటూ కరోనాను కారణంగా న్యూజిలాండ్ చూపింది. మరికొన్ని దేశాలు కూడా చేరవచ్చు.

అమెరికా తన పెరటితోటగా భావించే లాటిన్ అమెరికా లోని అర్జెంటీనా కూడా హాజరవుతోంది. సముద్రం లోకి ప్రవహించే నదులను పర్వతాలు నిరోధించలేవని చైనా ఎద్దేవా చేసింది. రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం క్రీడలను ఒక సాధనంగా వాడుకోవాలని చూడటం గర్హనీయం. చైనా లోని షిన్‌జాంగ్ రాష్ట్రంలో ముస్లిం సామాజిక తరగతి మానవ హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ అమెరికా, దాని కూటమి దేశాలు యాగీ చేస్తున్నాయి. బ్రిటన్ లోని లివర్‌పూల్ పట్టణంలో జరిగిన జి-7 దేశాల విదేశాంగ, అభివృద్ధి మంత్రుల సమావేశం చైనా ఆర్థిక ఒత్తిళ్ల పేరుతో కొత్త పల్లవి అందుకుంది. పొద్దున లేస్తే తమకు లొంగని దేశాల మీద ఆర్థిక, దౌత్య, ఇతర ఆంక్షలను విధిస్తున్న అమెరికా, దానికి తందాన తాన అంటున్న దేశాలు చైనా మీద ప్రచార దాడి ప్రారంభించటంలో ఆశ్చర్యం లేదు. డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంలో అమెరికా ఇప్పటివరకు సాధించిందేమీ లేకపోగా నష్టపోయింది. అమెరికా చేస్తున్న ఆర్థిక ఒత్తిళ్లకు అనేక ఉదంతాలను ఉదాహరణగా పేర్కొనవచ్చు. పసిఫిక్ సముద్రంలో నౌరు, కిరిబటి, మైక్రోనేసియా అనే మూడు చిన్న దీవుల దేశాలున్నాయి. ఇంటర్నెట్ సేవలను మెరుగు పరచేందుకు సముద్రంలో వైర్ల ద్వారా సమాచారాన్ని పంపే ప్రపంచ బ్యాంకు పథకాన్ని 7.25 కోట్ల డాలర్లతో రూపొందించి అంతర్జాతీయ టెండర్లు పిలిచారు. దానిలో చైనా కంపెనీ ఒకటి 20 శాతం తక్కువకు టెండరు వేసి కాంట్రాక్టు దక్కించుకుంది. చైనా కంపెనీకి గనుక పని అప్పగిస్తే భద్రతకు ముప్పు వస్తుందంటూ అమెరికా ఒత్తిడి తెచ్చి సదరు ప్రాజెక్టును అడ్డుకుంది. ఇది తాజా ఉదంతం. అంతకు ముందు హువెయి, టిక్‌టాక్, మూడు టెలికాం కంపెనీల మీద ఆంక్షలు విధించటం, వాటిని బ్లాక్ లిస్టులో పెట్టటం, వాటి ఉత్పత్తులు కొనుగోలు చేసిన, సేవలు పొందిన దేశాల మీద చర్యలు తీసుకుంటామని బెదిరించటం, స్టాక్ మార్కెట్ నుంచి కంపెనీలను తొలగించటం, హువెయి కంపెనీ ఉన్నతాధికారిణిని కెనడాలో అరెస్టు చేయించటం తెలిసిందే. చైనా సంగతిని పక్కన పెడితే ఫ్రెంచి కంపెనీ అస్టోమ్‌పై 77.23 కోట్ల డాలర్ల జరిమానా విధించింది. ఐరోపా విమాన కంపెనీ ఎయిర్ బస్‌పై 2020లో పన్నులు పెంచింది. అంతెందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఎంత సన్నిహితంగా మెలిగినా మన ఎగుమతులపై పన్నుల రాయితీని రద్దు చేసిన డోనాల్డ్ ట్రంప్‌గానీ, తరువాత గద్దెనెక్కిన బైడెన్ గానీ వాటిని పునరుద్ధరించలేదు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేస్తే మన దేశం మీద కూడా చర్య తీసుకుంటామని అమెరికా చేసిన బెదిరింపులకు నరేంద్ర మోడీ భయపడి నిలిపివేసిన అంశం తెలిసినదే. లివర్‌పూల్‌లో జరిగిన జి-7 దేశాల సమావేశం చేసిన ప్రకటనల్లో ప్రస్తావించిన షిన్‌జాంగ్, హాంకాంగ్, టిబెట్, తైవాన్, దక్షిణ చైనా సముద్రం వంటి అంశాలన్నీ చైనా అంతర్గత విషయాల్లో వేలు పెట్టటమే. మానవ హక్కులలో ఆరోగ్యం కూడా ఒకటి. ప్రపంచ జనాభాలో అమెరికా, బ్రిటన్ జనాభా కేవలం ఐదుశాతం, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు, ఆరోగ్య వ్యవస్థలు వున్నాయి. అయినా ప్రపంచ కరోనా కేసుల్లో 23 శాతం, మరణాల్లో 18 శాతం అక్కడే అంటూ జీవించే హక్కును కాపాడాలని చైనా డిమాండ్ చేసింది. ఆపని చేయకుండా మిగతా దేశాల్లో మానవ హక్కులు, ప్రజాస్వామ్యం గురించి కబుర్లు చెబుతున్నాయని పేర్కొన్నది. ప్రపంచ వ్యాపితంగా రెండులక్షలకు పైగా సైన్యాలను, అణ్వాయుధాలతో సహా ఆధునిక క్షిపణులను మోహరించి నిత్యం ప్రపంచాన్ని భయపెడుతున్నది అమెరికా. ఎవరు ఏ ఆయుధాలు కొనాలో, కొనకూడదో నిర్దేశిస్తోంది. రష్యా నుంచి ఆధునిక క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు నిర్ణయించిన మన దేశంపై ఆంక్షలు విధిస్తామని బెదిరింపులకు దిగిన అంశం కూడా తెలిసిందే. చైనాను గుర్తించకుండా తైవానే అసలైన చైనాగా చిత్రించి 1948 నుంచి 1971వరకు ఐక్య రాజ్య సమితిలో, 2001 వరకు ప్రపంచ వాణిజ్య సంస్థలో ప్రవేశించకుండా అడ్డుకొన్నది అమెరికా. ప్రస్తుతం అది కానసాగిస్తున్న వాణిజ్య యుద్ధం ఆర్థిక ఒత్తిడి కాదా? మానవ హక్కుల పరిరక్షణ అన్నది తన డి.ఎన్.ఎ లోనే ఉన్నదని అమెరికా చెప్పుకుంటోంది. ఆచరణలో మానవ హక్కుల హరణమే దాని డి.ఎన్.ఎ అని రుజువు చేస్తోంది. వందల ఏండ్ల క్రితం ఆఫ్రికా నుంచి జనాలను బానిసలుగా పట్టుకువచ్చింది అమెరికన్లు, వారిని కాపలా కాసేందుకు ఏర్పాటు చేసుకున్నదే అమెరికా పోలీసు వ్యవస్థ, దాని అవశేషాలే ఇప్పటికీ ఆఫ్రో-అమెరికన్లను హతమారుస్తున్న దురంతాలు. అమెరికా పొలాలు, కారా?నాల్లో పని చేసిన ఆఫ్రికన్ బానిసలకు పరిహారం చెల్లించాల్సి వస్తే ఆ మొత్తం ఇప్పుడు 97 లక్షల కోట్ల డాలర్లని జాక్ కోపే అనే ఆర్థికవేత్త అంచనా. రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికా అణుబాంబులు వేసి 66 వేల మందిని హిరోషిమాలో, 39 వేల మందిని నాగసాకిలో పొట్టన పెట్టుకుంది. తరువాత కూడా దాని పర్యవసానాలకు ఎందరో బలయ్యారు. ఇలాంటి అమెరికా ప్రజాస్వామ్యం, మానవహక్కుల గానాలాపన చేస్తుంటే దానికి కెనడా, బ్రిటన్, జపాన్ వంత పాడటం సహజమే. ఎందుకంటే ఈ దేశాలు కూడా మానవ హక్కుల హరణంలో తక్కువ తినలేదు. ఇక ఐరోపా సామ్రాజ్యవాద వారసులే కనుక ఆస్ట్రేలియా వారి వెనుక నడవటంలో ఆశ్చర్యం లేదు. ప్రపంచమంతటా అమెరికాకు చిన్నవీ, పెద్దవీ 800 వందల సైనిక కేంద్రాలు ఉన్నాయి. చైనాకు ఉన్నది ఒక్కటి, అదీ నాలుగు వందల అమెరికా కేంద్రాల మధ్య ఉంది. క్రీడలపై బహిష్కరణ అస్త్రం పెద్దగా పని చేయకపోయినా దీని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని కొందరు చెబుతున్నారు. చైనా సహకారం, ప్రమేయం లేకుండా నేడు అంతర్జాతీయ రాజకీయాలు ముందుకు పోవు. గతంలో 1980 మాస్కో ఒలింపిక్స్‌ను అమెరికాతో సహా 66 దేశాలు బహిష్కరించాయి. తైవాన్‌కు గుర్తింపు ఇచ్చిన కారణంగా 1956 నుంచి 1980 వరకు చైనా అసలు మొత్తంగా ఒలింపిక్స్‌ను బహిష్కరించింది. తరువాత 1984 లాస్ ఏంజెల్స్ క్రీడలలో సోవియట్, పదమూడు తూర్పు ఐరోపా దేశాలు పాల్గొనలేదు. ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ జోక్యాన్ని 1980లో అమెరిరా సాకుగా చూపింది. కానీ అదే అమెరికా, దాని మిత్ర దేశాలు తరువాత వివిధ దేశాల్లో మారణకాండ సాగించినా ఎవరూ క్రీడలకూ-వాటికి పోటీ పెట్టలేదు. బీజింగ్ ఒలింపిక్స్ ప్రారంభ సభకు అందిన ఆహ్వానాన్ని అంగీకరించినట్లు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ చెప్పారు. క్రీడలను రాజకీయం చేయకూడదని ఫ్రెంచి అధ్యక్షుడు మాక్రాన్ అన్నారు. అమెరికా దౌత్యపరమైన బహిష్కరణకే పరిమితం కావటం వెనుక అక్కడి మీడియా సంస్థల వాణిజ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. క్రీడలను చూపేందుకు ఎన్‌బిసి సంస్థ ఒలింపిక్స్ కమిటీకి బిలియన్ల డాలర్లు చెల్లించింది. పోటీల్లో అమెరికన్ క్రీడాకారులు లేకపోతే దానికి పెద్ద నష్టం వాటిల్లుతుంది. మిగతా దేశాలకూ అదే సమస్యలున్నాయి. 2014లో ఎడ్వర్డ్ స్నోడెన్‌కు ఆశ్రయం ఇచ్చిన కారణంగా రష్యాలోని సోచిలో జరిగిన శీతాకాల క్రీడలను నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఉపాధ్యక్షుడు జోబైడెన్, ప్రథమ మహిళ మిషెల్లీ ఒబామా మాత్రమే బహిష్కరించారు. ప్రస్తుత అమెరికా కూటమి చర్యకు ప్రతీకారంగా 2028 లాస్ ఏంజెల్స్, 2032 బ్రిస్‌బేన్ (ఆస్ట్రేలియా) ఒలింపిక్స్‌ను చైనా బహిష్కరించ వచ్చన్న అనుమానాలు వ్యక్తం చేసిన వారు కూడా లేకపోలేదు. చైనా వైపు నుంచి అలాంటి సూచనలైతే లేవు.

## బతుకే దిగులు



పొలమంతా
గింజలతో పాటుగా
కలలు కూడా నాటి
ప్రేమను ఎరువుగా చల్లాడు.

పచ్చన కనిపించేదాక
పొద్దుకూకులు శ్రమే
చెమట ముద్దలతో
మొలకను పోషించాడు

కానీ...
పంట పచ్చని ముఖంపై
గాలి విసురుకు
వాన ముసురులో
వర్షం, వరద శత్రువై
పంట ఇల్లు కుప్పకూలి

మడి మనసు ముక్కలై
తడి కళ్ళతో పంట
గుండె పగిలి కల

గింజ గొంతు తెగి
చేను చితికి చేరి
కల్లం కన్నీరు పెట్టింది.

సాగుకు పాలకుల శాపమో?
సృష్టి మాయో?
కష్టమెప్పుడూ విలువైన చులకన.
రైతుది ఏనాడూ దిగులైన బతుకే.

## సొంత కాళ్ళ మీద నిలబడే నాయకత్వం కనుమరుగవుతున్నదా..?

బిఎస్.రాములు

ఏక పార్టీ నాయకత్వం ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు. అది అంతులేని అవినీతి కి, అధికార దుర్వినియోగానికి దారి తీస్తుంది. అందువల్ల కనీసం రెండు పార్టీ లైనా బలంగా, పోటా పోటీగా ఉండాలి. తెలంగాణాలో స్వంత కాళ్ళ మీద నిలబడే నాయకత్వం కనుమరుగవుతున్న దా? కాంగ్రెస్, బిజెపి, టిఆర్ఎస్, బియస్పీ, ఫార్వర్డ్ బ్లాక్, సమాజ్ వాదీ, ఆర్ ఎస్పీ వంటి పార్టీల పంచన చేరి తమ భవిష్యత్ వెతుక్కుంటున్నారు. అంతేగాని తెలంగాణ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ఇతర రాష్ట్రాల లో వలె స్వంత కాళ్ల మీద నిలబడే ఒక పార్టీ ని నిర్మాణం చేద్దాం యువతరానికి మార్గం చూపుదాం అనేవారు కనుమరుగవుతున్నారు. తెలంగాణ భవిష్యత్తు ఏం కానున్నదో! పెద్దలు సీరియస్ గా ఆలోచించి దారి వేయాలి.ఎవరికి వారుగా ఆలోచిస్తే కుటుంబానికో, తమ వర్గానికో ప్రయోజనానికోమ పరిమితమవుతారు. తాను ఒక్కడే బయల్దేరినా మొత్తం సమాజం కోసం కదిలినప్పుడు ప్రజలు వెంట వస్తారు. ప్రజల మధ్యన పని చేసే వారికి మిగతా వారి ఖర్చులో పది శాతం సరిపోతుంది. ఇది ఎన్నోసార్లు నిరూపించారు ప్రజలు. క్వాలిటీ, క్వాంటిటీ, కమిట్మెంట్, నేను పాపులారిటీ, ఉన్నవారితో విజయం సాధ్యం. విజయానికి చేరువ వుతూ యువ తరానికి మార్గ దర్శకులవుతారు. ప్రతి రంగం లో వలెనే రాజకీయ రంగంలోనూ ప్రతి మూడేళ్లకు, ఐదేళ్లకు కొత్త తరం తన భవిష్యత్ ను వెతుక్కుంటుంది. 1965 లో విశాఖ ఉక్కు 1969 లో జై తెలంగాణ, 1972 లో జై ఆంధ్ర, 1976 లో ఎమర్జెన్సీ వ్యతిరేక, 1982 లో ఎన్టీఆర్ , టిడిపి, ఉద్యమాలలో యువతరం నాయకులు గా ఎదిగి వచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనుకూల, వ్యతిరేక ఉద్యమాలలో ఎంతో యువతరం ఎదిగింది. వారందరినీ ఉద్యమ నాయకుల నుండి రాజకీయ నాయకులు గా స్వీకరించ లేకపోయింది. తెలంగాణ లోనైనా ఆంధ్రప్రదేశ్ లోనైనా మరో ప్రాంతీయ పార్టీ ఎదగడం అవసరం. అపుడే తమిళనాడు లో వలె ప్రాంతీయ పార్టీలు స్థిర పడుతాయి. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ వంటి విద్యావంతులున్న రాష్ట్రంలో ప్రజల హృదయాలను గెలిచి దేశానికి ఆదర్శంగా నిలిచారు. ఇలా ఇతర రంగాలలో పాపులర్ అయిన వారు ముందుకు వస్తే తెలుగు రాష్ట్రాల్లో నూతన యువ నాయకత్వం సమీకరణ జరిగి గొప్ప మార్పు సాధ్య పడుతుంది.

## యన్. జి. ఓ. ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంధన పొదుపుపై అవగాహన




నరసరావుపేట. ప్రజాపాలన :జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు పురస్కరించుకుని వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గకేంద్రంలో స్థానిక పవర్ హౌస్ రోడ్డు లో ఉన్న శ్రీచైతన్య స్కూలో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ ఆధ్వర్యంలో అవగాహన కలిపించాము అని ఆ సంస్థ సభ్యులు కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లో పనిచేసే ఆర్. బంగారయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశనుండే కరెంటు ఆదా చేయాలి అని, మీ ఇంట్లో ఉన్న విద్యుత్ పరికరాలు"స్టార్ రేటింగ్"తో కుడినవా కాదా అని ఒక సారి పరిశీలించాలి అని, స్టార్ రేటింగ్స్ ఉంటే తక్కువ విద్యుత్ తో పరికరాలు పనిచేస్తాయి అని, దీనివల్ల బిల్లు కూడా తక్కువే అవుతుంది అని దీనినే విద్యుత్ పొదుపు డబ్బులు పొదుపు అంటారు అని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తెలుసుకోవాలిసిన అంశం కరెంటు అవసరం లేని చోట స్విచ్ఛాఫ్ చేయాలి అని, యల్. ఈ. డి బలుపులు వాడాలి అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు, విద్యార్థులచేత ఇంధన పొదుపు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండవరోజు కొనసాగిన బ్యాంకుల సమ్మె



నరసరావుపేట. ప్రజాపాలన :రొంపిచర్ల మండల కేంద్రమైన రొంపిచర్లలో ఎన్ బి ఐ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుల సిబ్బంది రెండవరోజు అయిన శుక్రవారం సమ్మె పాటించారు. వీరికి సిపిఐ ఎఐటియుసి నాయకులు మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్నారు. ఆయా బ్యాంకుల ఎదుట మానవహారం నిర్వహించారు. బ్యాంకుల సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి కళ్ళకు గంతలు కట్టుకుని సమ్మెలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వమునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బ్యాంకుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిలిపివేయాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎఐటియుసి ఏరియా కార్యదర్శి వైదన వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు ప్రయోజనాల కొరకు బ్యాంకులు ప్రైవేటీకరణ చేసేందుకు సన్నాహాలు చేస్తుందని అన్నారు. ప్రజల కొరకు పనిచేస్తున్న బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు ఆయా బ్యాంకుల ఉద్యోగులు నడికోట వెంకట్రామయ్య ,జమ్ములమడుగు శివనాగేశ్వరరావు, ఖాశిం, మోటుపల్లి మల్లికార్జునరావు సిబ్బంది పాల్గొన్నారు.

## జెడి లక్ష్మీనారాయణకు స్వాగతం పలికిన కావలి వాసులు



కావలి డిశంబర్ 17 ప్రజాపాలన ప్రతినిధి :జాయిన్ ఫర్ డెవలప్మెంట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాజీ సిబిఐ అధికారి జేడీ లక్ష్మీనారాయణ కావలి మద్దూరుపాడు కళాశాలలో జరుగు ఒక కార్యక్రమంలో భాగంగా ఆయనను ది పూర్ పీపుల్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చేవూరుచిన్న తన అనుచరులతో ఆత్మీయ కలయికతో శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు,ఈ సందర్భంగా జెడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆర్థికముగా బలపడిన అన్ని వర్గాల వారు సమసమాజ నిర్మాణ వాదులు సంస్థలుగా ఏర్పడి ప్రజలకు తమవంతు సేవలను అందిస్తూ "మానవ సేవే మాధవ సేవ"గా సామాజిక సేవాతో ఆనందంగా గడపాలని ఆయన అన్నారు,పై కార్యక్రమంలో నరహరి ప్రభావతి,మాకినేని అరుణ, సీనియర్ జర్నలిస్ట్ సిద్ది.జయ ప్రతాపరెడ్డి,ప్రభావతి,వట్టికాల రమణయ్య, సిద్ది.వెంకట్ కౌశిక్ రెడ్డి, పాల్గొన్నారు.

## నేరాలు, మోసాలపై అవగాహన కార్యక్రమం



పొన్నూరు డిసెంబర్17 (ప్రజా పాలన ప్రతినిధి) :స్థానిక గ్రామ, పట్టణ ప్రాంతాలలో జరుగుతున్న వివిధ నేరాలు, మోసాలపై పొన్నూరు పట్టణం 9వ వార్డులో అర్బన్ ఎస్ఐ. ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. చిట్టీల పేరుతో నమ్మకంగా మోసాలు, ఎవరూ లేని సమయంలో ఇళ్లల్లో చోరీలు, ఫోన్ నెంబర్ల ద్వారా డబ్బులు దొంగిలించడం వివిధ అసాంఘిక కార్యక్రమాలు ఎలా జరుగుతాయి వాటిని ఎలా నివారించవచ్చు అని ప్రజలకు ఎస్ఐ .ప్రసాద్ వివరించారు. ప్రజలు అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఇటీవల చెడ్డి గ్యాంగ్ దోపిడీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే 100 నెంబర్ కానీ స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తో పాటు సచివాలయ మహిళా పోలీస్ పాల్గొన్నారు.

# అమరావతినే రాజధానిగా ఉంచాలి

### నరసరావుపేట టిడిపి ఇన్చార్జ్ అరవింద బాబు







నరసరావుపేట. ప్రజాపాలన :అమరావతి నే రాజధానిగా ఉంచాలని నరసరావుపేట తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్. చదలవాడ అరవింద్ బాబు అన్నారు.బిఅమరావతి రైతుల పాదయాత్రకు సంఘీభావంగా నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో టీడీపి పార్టీ కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పోలీసుల లాఠీ దెబ్బలకు,తుఫాన్ ల తాకిడికి ఓర్చుకొని న్యాయస్థానం నుండి దేవస్థానం వరకు పాదయాత్ర చేసిన అక్క చెల్లమ్మలకు, అన్నా తమ్ముళ్లకు ధన్యవాదాలు తెలిపారు.33 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల ఉసురు జగన్ కు తగలగ తప్పదు అని ఒకే రాష్ట్రం,ఒకే రాజధాని అమరావతి నినాదం తో సాగిన మహా పాదయాత్ర సాగిందన్నారు.బివైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాలు నష్ట పోయారని, ప్రజారాజ ధాని అమరావతినే కట్టలేని ఈ అసమర్థ ముఖ్య మంత్రి మూడు రాజధానులు కడతానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.బిజగన్ ప్రభు త్వంలో మద్యం మాఫియా, ఇసుక మాఫియా, గంజాయి మాఫి యా విచ్చలవిడిగా చెలరేగిపోతున్నాయని,అభివృద్ధి మాత్రం శూన్యం అని ఆయన అన్నారు.రెండున్నర సంవత్స రాలుగా అమరావతి రైతులు,మహిళలు,రాష్ట్ర ప్రజలు చేస్తున్న అమరావతి ఉద్యమానికి న్యాయస్థానాలు ప్రజలు అండగా ఉన్నారని,ఆంధ్రప్రదేశ్ కు ఒకే ఒక రాజధాని ఉండాలని అది అమరావతి కావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నరసరావుపేట తెలుగుదేశం పార్టీ నాయకులు కడియాల రమేష్, కొల్లి బ్రహ్మయ్య, కొట్ట కిరణ్ కుమార్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జనరిక్ మందుల పట్ల చిన్నచూపు తగదు



భీమవరం, డిసెంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి) : జనరిక్ మందుల పట్ల చిన్నచూపు తగదని తాను జనరిక్ మందులనే వాడుతున్నానని మార్కెట్లో విక్రయించే మందులలో ఏనాణ్యత ఉంటుందో జనరిక్ మందులలో కూడా అదే నాణ్యత ఉంటుందని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ సమీపంలోని డిసిఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జనరిక్ మందుల షాపు ను శుక్రవారం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో కొన్ని ప్రాంతాలలో ఇప్పటికే జనరిక్ మందుల షాపులు ఉన్నప్పటికీ ప్రజలు వాటిని ఆదరించడంలేదని దీనికి జనరిక్ మందుల ధరలు తక్కువగా ఉండడమే కారణమని అన్నారు. దీనికి కారణం వివిధ కంపెనీల మందులు, సిరప్ లను మందుల షాపుల వారు నేరుగా కొనుగోలు చేయరని రిప్రజెంటేటివ్ మరియు డీలర్ల ద్వారా వాటిని కొనుగోలు చేయడం వలన మార్కెట్లో వాటి ధరలు అధికంగా ఉంటాయని తెలిపారు. అయితే ప్రభుత్వం మరియు డీసీఎంఎస్ ద్వారా నడుస్తున్న ఈ జనరిక్ మందుల షాపులకు మందులు, సిరప్ లు నేరుగా కంపెనీల నుండి వస్తున్నాయని అందుకే వాటిధరలు తక్కువగా ఉంటాయని ఆయన తెలిపారు. నాణ్యమైన మందులను ప్రజలకు తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతో డీసీఎంఎస్ ద్వారా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో, మండల కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్నామని ఇందుకు డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామిని అభినందిస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, ఏఎంసీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, రాష్ట్ర అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, పార్టీ నాయకులు తోట భోగయ్య, గూడూరి ఉమాబాల, పాలవెల్లి మంగ, అల్లూరి నాగవల్లి, వేంద్ర విజయదుర్గ, ఏఎస్ రాజు, ఎడ్వర్డ్, చెల్లబోయిన సూర్యప్రకాష్, ముత్యాల రామారావు, మానేపల్లి నాగన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పై అధిక భారాలు తగవు: నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట. ప్రజాపాలన :నరసరావుపేట పట్టణంలో స్థానిక 02 వార్డ్ ఐల బజార్ తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి రాత్రి ప్రజా చైతన్య యాత్రలో నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా. అరవింద బాబు పాల్గొన్నారు.వార్డుకి వచ్చేసిన ఆయనకు వార్డు నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ఆరు సార్లు విద్యుత్ చార్జీలను పెంచింది.విద్యుత్ ఛార్జీలు పెంచడంతో పాటు రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రైతు మెడకు ఉరితాడు బిగించారు.సర్దుబాటు చార్జీల పేరుతో సామాన్య, మధ్యతరగతి ప్రజల పై మోయలేని భారాన్ని మోపారు.విద్యుత్ చార్జీలను భారీగా పెంచి సామాన్య, మధ్య తరగతి,పేద కుటుంబాల నడ్డి విరిచారు.నాణ్యమైన విద్యుత్ ఇస్తామని హామీలు ఇచ్చి,కరెంటు కోతలు



పెంచిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుంది అన్నారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎరువులు,పురుగు మందుల ధరలు భారీగా పెంచడంతో రైతన్నకు సాగు కష్టాలు ప్రారంభమయ్యాయి.రెండున్నర ఏళ్ళ వైసీపీ పాలనలో ల్యాండ్, సాండ్, వైన్, మైన్ మాఫియా రాజ్యమేలుతోంది అన్నారు.పెంచిన విద్యుత్ చార్జీలను సామాన్యుడి పై పడుతున్న అదనపు భారాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లాలని టీడీపీ నాయకులను,కార్యకర్తలను డా.చదలవాడ కోరారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మాజీ కౌన్సెలర్ కొవ్వూరి బాబు,పార్లమెంట్ కార్యదర్శి అల్లంశెట్టి మోహన్ రావు, పొత్తూరి శ్రీను,ఫణి,బొమిశెట్టి సాయి,బెల్లంకొండ రాజేష్ వార్డ్ మరియు పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపు పై విద్యార్థులకు అవగాహన తరగతులు: డీఈ అచ్యుతాచారి



కొవ్వూరు,ప్రజాపాలన ప్రతినిధి : విద్యుత్ విషయంలో పొదుపు అనేది ప్రధానమనీ , దానిని విస్మరిస్తే భావితరాలకు విద్యుత్ కొరత ఏర్పడుతుందని కొవ్వూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి అచ్యుతాచారి అన్నారు.డిసెంబర్ 14వ తేదీ నుండి 20 వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొవ్వూరు పట్టణం లోని శ్రీ అభ్యాస స్కూల్ నందు విద్యార్థినీ విద్యార్థులకు విద్యుత్ పొదుపు పై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అచ్యుత చారి మాట్లాడుతూ ఇంధన పొదుపు అందరి బాధ్యత అని విద్యుత్ ను వృధాగా వినియోగం చేయడంతో భావితరాలకు విద్యుత్ కొరత ఏర్పడుతుందన్నారు. ఒక యూనిట్ విద్యుత్ను పొదుపు చేస్తే రెండు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లే నని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలోకొవ్వూరు పట్టణ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ , శ్రీ అభ్యాస స్కూల్ కరస్పాండెంట్ రఘురాం, ఉపాధ్యాయినీ ,ఉపాధ్యాయులు విద్యార్థినీ , విద్యార్థులు ఉన్నారు.

## పొన్నూరు లో బ్యాంకు ఉద్యోగుల బంద్



పొన్నూరు, డిసెంబర్17 (ప్రజా పాలన ప్రతినిధి) :ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చట్టానికి వ్యతిరేకంగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపుమేరకు దేశ వ్యాప్త బందులో భాగంగా పొన్నూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు దేవరపల్లి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాంకు సిబ్బంది బంద్ పాటించారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా చేస్తున్న బందులో భాగంగా బ్యాంకు ఉద్యోగులు విధులను బహిష్కరించి బ్యాంకు ఎదుట కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు దేవరపల్లి అనిల్ కుమార్ సిహెచ్ రోజ్ మేరీ, బ్యాంకు మేనేజర్ లు పవన్, శివకృష్ణ, యూనియన్ నాయకులు డిఎల్ విజయ్ కుమార్, పి రవి, అజయ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలో కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కిలారి



పొన్నూరు డిసెంబర్17 (ప్రజా పాలన ప్రతినిధి) : పొన్నూరు పట్టణములో శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి కమిటీ వారిచే నిర్మించిన మినీ కళ్యాణ మండపం , రాజ గోపురాలకు ఏర్పాటు చేసిన కవాటాల ను శుక్రవారం ఎమ్మెల్యే కిలారి రోశయ్య ప్రారంభించారు. శ్రీ సద్గురు జగన్నాథ స్వామి వారి విగ్రహం ఏర్పాటు చేసే స్థలం నకు భూమి పూజ చేసి అనంతరం శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మాతృశ్రీ లక్ష్మీకాంతమ్మ అమ్మవారి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో టి. శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగసూరి ప్రతాప్ కుమార్ ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎన్. రాధా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




పొన్నూరు డిసెంబర్17 (ప్రజా పాలన ప్రతినిధి) :ఆటో కార్మికుల కుటుంబ కష్టనష్టాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ ,వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుప్పల సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సజ్జా కళ్యాణ మండపం దగ్గర ఏర్పాటు చేసిన ఆటో యూనియన్ 14వ మహా సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినట్లు ఆటో కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకుడు ఆరేటి రామారావు అధ్యక్షత వహించారు. సభలో అర్బన్ ఎస్ఐ. ప్రసాద్ మాట్లాడుతూ ఆటో కార్మికుల డిమాండ్లను ఆయన సమర్థించారు. అలానే ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఆటో కార్మికుడు ట్రాఫిక్ నియంత్రణ పై అవగాహన కలిగి ఉండి పోలీసు వారికి సహకరించాలని సూచించారు. పట్టణ అధ్యక్షుడు ఎడ్ల వందనం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పొదుపు పాటించి ఆర్థికంగా కుటుంబాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అలానే ప్రభుత్వం విధిస్తున్న వాహన టాక్స్ లు తగ్గించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ. దాసు, యూనియన్ కార్యదర్శి కె. రత్నబాబు, గుమ్మడి ప్రసాద్, జిలాని, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ల నిర్మాణాలతో విద్యుత్ వ్యవస్థ మరింత బలోపేతం



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 63 వ డివిజన్ ఉడా కాలనీలో అధునాతున సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ఎస్ఈ శివప్రసాద్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఆయన పరిశీలించారు. సబ్ స్టేషన్ నిర్మాణ పనులను సంక్రాంతి నాటి కల్లా పూర్తి చేయవలసిందిగా ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరం విస్తరిస్తున్న తరుణంలో శివారు కాలనీల వరకు విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయవలసిన ఆవశ్యకత ఉందన్నారు. కరెంట్ కోతలు, అంతరాయాలకు అవకాశం లేకుండా చిట్టచివరి కాలనీలకు సైతం నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో మూడు విద్యుత్ స్టేషన్లను నిర్మిస్తున్నట్లు వివరించారు. ఉడా కాలనీకి సంబంధించిన రూ. 3 కోట్లతో పనులు జరుగుతున్నాయని.. జనవరి నాటి కల్లా సబ్ స్టేషన్ అందుబాటులోకి రానుందని తెలిపారు. అదే గత టీడీపీ హయాంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా ఈ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు తప్ప ఎక్కడా కూడా పనులు ప్రారంభించలేదన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యుల చేతులమీదుగా సబ్ స్టేషన్ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, శ్రీనగర్ కాలనీలలో ఒక్కొక్కటి రూ. 5 కోట్ల నిధులతో మంజూరైన కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పూర్తికాగా.. త్వరలో నిర్మాణాలను ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లా ఇంఛార్జి మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారి చేతులమీదుగా రెండు నూతన సబ్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపనలను నిర్వహిస్తామన్నారు. వచ్చే వేసవి నాటికి నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యమని వివరించారు. మరోవైపు ట్రూఅప్ ఛార్జీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఒక్క నిర్ణయంతో డిసెంబరు నెలలో విద్యుత్తు వినియోగదారులకు ఉపశమనం లభించిందని మల్లాది విష్ణు అన్నారు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వసూలుచేసిన ఛార్జీలను డిసెంబరు నెల బిల్లులలో సర్దుబాటు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి 1.24 లక్షల మంది గృహ వినియోగదారులకు రూ. 5.04 కోట్ల లబ్ధి కలిగిందని మల్లాది విష్ణు గారు అన్నారు. కార్యక్రమంలో ఈఈ(ఎలక్ట్రికల్) సుధాకర్, డీఈలు రవిచంద్ర, రమేష్, ఏఈలు కృష్ణారెడ్డి, జగన్నాథం, నాయకులు మోదుగుల గణేష్, సీహెచ్ రవి, టెక్కెం కృష్ణ, తిరుపతిరావు, జగదీష్, మల్లీశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఓ టి ఎస్ పై అవగాహన కార్యక్రమం



పొన్నూరు డిసెంబర్17( ప్రజాపాలన ప్రతినిధి) :జగనన్న వన్ టైం సెటిల్మెంట్ పథకంపై శుక్రవారం పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎన్. రాధ పట్టణ ప్రాంతంలో గతంలో ప్రభుత్వ రుణం తీసుకున్న యజమానులు త్వరితగతిన చెల్లిస్తే ప్రభుత్వం శాశ్వత రిజిస్ట్రేషన్ పట్టాలను అందిస్తుందని తెలిపారు. తాసిల్దార్ డి. పద్మనాభుడు మాట్లాడుతూ మధ్యతరగతి గృహ యజమానులకు ఈ పథకం వలన బహుళ ప్రయోజనాలు పొందుతారని అన్నారు. హౌసింగ్ డి ఈ .శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డు సచివాలయ పరిధులలో ఓ టి ఎస్ పై అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులపై చైర్ పర్సన్ పర్యవేక్షణ



నరసాపురం డిసెంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి) : మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ జయరాజు శుక్రవారం పట్టణంలోని ఒకటవవార్డు శ్రీహరిపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె వార్డులోని పారిశుధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పట్టణపరిధిలో ఉన్న ప్రతి వార్డులోనూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పారిశుద్ధ్యం లోపిస్తే అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని దోమల నిర్మూలనకోసం తగుచర్యలు తీసుకోవాలని శానిటరీ సిబ్బందిని ఆమె ఆదేశించారు. పట్టణంలో దోమలు నివారణకు ఆయిల్ బాల్స్, మరియు ఫాగింగ్ చేపట్టాలని చైర్ పర్సన్ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ సోమరాజు భవాని భరత్, మున్సిపల్ కమీషనర్ పి.ఎమ్.సత్యవేణి, టీపీఓ బాలాజీ, అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్, రవితేజ, శానిటరీ ఇన్స్పెక్టర్ ,సత్యనారాయణరాజు, మునిసిపల్ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం పర్యటన..తణుకు లో చురుగ్గా సభావేదిక ఏర్పాటు



తణుకు, ప్రజాపాలన ప్రతినిధి :డిసెంబర్ 21 మంగళవారం జగనన్న సంపూర్ణ భూమి హక్కు పథకం రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని శాసనసభ్యులు డా.కారుమూరి నాగేశ్వరరావు, ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచే స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎండకు, వానకు ఇబ్బంది లేకుండా వాటర్ ప్రూఫ్ షెడ్స్ , గ్రౌండ్ లెవెలింగ్ పనులు చురుగ్గా చేపడుతున్నా మన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సర్వాంగ సుందరంగా సభా ప్రాంగణాన్ని తీర్చిదిద్దే పనుల్లో ఉన్నామని తెలిపారు. తణుకు జెడ్పి హై స్కూల్ ప్రాంగణానికి డిసెంబర్ 21 హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభ జరిగే వేదిక వరకు ముఖ్యమంత్రి వర్యులకు నియోజకవర్గ, జిల్లా ప్రజలు, పార్టీ కార్యకర్తలు , రహదారికి ఇరు వైపులా నిలిచి ఘన స్వాగతం పలకడం జరుగుతుందని శాసన సభ్యులు తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో ఎన్. మల్లిబాబు మాట్లాడుతూ గత మూడు రోజులుగా తణుకు లోనే ఉంటూ సీఎం పర్యటన పనులను వ్యక్తి గతంగా పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. గౌరవ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రూట్ మ్యాప్ మేరకు అనుగుణంగానే ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్డీవో మల్లిబాబు తెలిపారు. రెవెన్యూ, ఆర్ అండ్ బి, మునిసిపల్, హౌసింగ్, పోలీసు తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా వారి సూచనలతో పనులను పర్యవేక్షణ చేస్తూ, నివేదిక ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ కె ఎస్ మహిళా కళాశాల ఆవరణలో హెలిప్యాడ్ ఏర్పాటు చెయ్యడం జరిగిందని తెలిపారు. సభా ప్రాంగణంలో కూడా వ్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీవో మల్లిబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో ప్రారంభిస్తున్న దృష్ట్యా కలెక్టర్ వారి ఆదేశాలు మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. సభా ప్రాంగణంలో భూమి లెవిలింగ్ పనులు దాదాపు పూర్తి అయినట్లు, సభా వేదిక పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు.

## అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు



నరసాపురం, డిసెంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి) : నరసాపురం మండలం మల్లవరం గ్రామంలో శుక్రవారం శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు సుమారు 2 కోట్ల 30 లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారంచుట్టారు. గ్రామంలో అరుంధతీ పేటలో 25 లక్షల రూపాయల15వ ఆర్థికసంఘం నిధులతో నిర్మించబోయే యస్.సి కమ్యూనిటీ భవన నిర్మాణానికి, రెండవ విడత నాడు నేడు కార్యక్రమంలో భాగంగా 86 లక్షలు రూపాయలు నిధులతో జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులు, 13 లక్షల రూపాయలు నిధులతో ఎలిమెంటరీ పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా 16.30 లక్షల రూపాయలతో అభివృద్ధిచేసిన మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం, 40 లక్షల రూపాయలతో నిర్మించిన అంతర్గత సీసీ రహదారులు, 40 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనంను ఆయన ప్రారంభించారు. గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసినసభలో శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ, కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆపకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నడిపిస్తున్నారని అన్నారు. గ్రామానికి రెండు సంవత్సరాల్లో సుమారు 5 కోట్ల రూపాయలు నిధులతో పలు అభివృద్ధి పనులు మంజూరుచేయడం జరిగిందని వివరించారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. సచివాలయం వ్యవస్థ తీసుకువచ్చి ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ యన్.వి.యస్. ప్రసాద్ యాదవ్, ఎమ్ఈఓ పి. పుష్పరాజ్యం, జడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, పార్టీ నాయకులు జేవిఆర్, దొంగ మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ అవార్డు యానాది మహిళలకు రావడం ఆనందం: ఆర్డిఓ



కావలి డిశంబర్ 17 ప్రజాపాలన ప్రతినిధి :అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డిశంబర్ 10వ తేదీన న్యూ ఢిల్లీలో యునెస్కో వారి ఆధ్వర్యంలో ఆండ్రాయిడ్ అనే అవార్డును బాపట్ల సత్యవతమ్మకు యివ్వడం చాలా ఆనందమని ఆర్డిఓ శీనా నాయక్ పేర్కొన్నారు. సంతోషమని ఎక్కడో తీర ప్రాంతంలో చల్లా యానాదుల కుటుంబంలో పుట్టి తీర ప్రాంతంలో యానాదిమహిళలందరినీ సమీకరించి వారిని పొదుపు గ్రూపులుగాను, ఫిషరీస్ సొసైటీలుగాను మార్చి వారందరికీ ఆర్థిక చేయూతనివ్వడమేగాక, వారి హక్కుల కోసం పోరాడటం చాలా ఆనందంగా ఉందని అన్నారు.. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితిజిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడుతూ యానాది మహిళలకు నిరంతరము కోట వాకాడు నుండి కావలి రూరల్ మండల తీరప్రాంత గ్రామాలలో పర్యటించి అన్నం లేకపోయినాపేద మహిళలను సంఘటితపరచి వారి హక్కుల కోసం పోరాడుతున్నప్పటికీ స్థానిక,జిల్లా పాలనా యంత్రాంగం, దళిత గిరిజన ఉద్యోగస్తులు అవమానించినా ఆ అవమానాన్ని చిగమింగి యానాది మహిళల కోసం నిరంతరం పోరాడిన బాపట్ల సత్యవతమ్మ న్యూఢిల్లీలో అవార్డు పొందడం గర్వనీయమని ఎర్రకోట ప్రక్కన సామాజిక వేదిక ద్వారా ఎంతోమంది. మహోన్నతుల మధ్య ఈ అవార్డు ఇవ్వడం ఎంతో ఉన్నతమైనది అని ఈ విధంగా పేద మహిళలను సంఘటితపరచి హక్కులు సాధించి పెట్టిన బాపట్ల సత్యవతమ్మను స్ఫూర్తిగా తీసుకుని మహిళలందరూ ఉద్యమించాలని ఆర్.వి.డి.ఎస్. రాష్ట్ర కన్వీనర్ మద్దెల వెంకటేశ్వర్లు, యానాది సంఘం జిల్లా నాయకుడు తనియాకుల వెంకటేశ్వర్లు, అనేక మంది మహిళలు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేస్తూ యునెస్కో వారు ఇచ్చిన స్వర్ణపతాక, శాలువాలతో ఆర్.డి.ఓ. కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

## పెన్షనర్స్ డే.. 25 మంది మహిళా పెన్షనర్ల సన్మానం



బాపట్ల ప్రజాపాలన బ్యూరో :రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ రోజు సంఘ నూతన భవనం నందు 'పెన్షనర్స్ డే కార్యక్రమం నిర్వహించటం జరిగినది. ఈ కార్యక్రమంలో 25 మంది మహిళా పెన్షనర్లకు మరియు ఫామిలీ పెన్షనర్లను సన్మానించటం జరిగినది. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా గుంటూరు జిల్లా పెన్షనర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ కె.నరసింహారెడ్డి, కె.కృష్ణయ్య, బాపట్ల యన్.జి.ఓ. సంఘ కార్యదర్శి ఇసాక్, కోశాధికారి రాయుడు, బాపట్ల యూనియన్ బ్యాంక్, చైతన్య గోదావరి బ్యాంకుల మేనేజర్లు, బాపట్ల పెన్షనర్ల సంఘ అధ్యక్షులు చెరుకూరి సుబ్బారావు, సహాధ్యక్షులు జిలాని, భావనారాయణ, కార్యదర్శి యమ్.పాపారావు, కోశాధికారి, చిత్తరంజన్ శర్మ, సంఘ కార్యవర్గ సభ్యులు, ఆర్.టి.సి తరుపున వల్లంశెట్టి వెంకటేశ్వర్లు, రామారావు తదితరులు, సంఘ శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిలుగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు తమ ప్రసంగంలో ప్రస్తుత రానున్న పి.ఆర్.సి.లో పెన్షనర్లకు అన్యాయం జరిగే అవకాశం ఉన్నందున, అవసరమైతే సంఘటిత పోరాటానికి సిద్ధంగా ఉండాలని, పెన్షనర్లకు పెన్షన్ కు సంబందించి ఎటువంటి ఇబ్బందులెదురైనా స్థానిక నాయకత్వం ద్వారా తమ దృష్టికి తెలియజేసినయడల తక్షణ పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. చెరుకూరి సుబ్బారావు, అధ్యక్షులు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం బాపట్ల.

## రైతులకు విత్తనాలు పంపిణీ



పొన్నూరు డిసెంబర్17 (ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు పట్టణం లో కర్షక్ సీడ్స్ దుకాణము నందు శుక్రవారం పొన్నూరు వ్యవసాయ సంచాలకులు సిహెచ్. తిరుమలదేవి తోపాటు వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని పలు గ్రామాల రైతులకు మహి కో ఎం. ఎస్. హెచ్ .51 రకం జొన్న విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఏ డి ఏ. తిరుమల దేవి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ అయిపోయిన అనంతరం రబీ సీజన్లో జొన్న, మొక్కజొన్న అపరాల పంటలు రైతులు పంపిస్తారని ఆమె అన్నారు. జొన్న, మొక్కజొన్న అపరాలు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు పొందాలని ఆమె సూచించారు. అలాగే విత్తన డీలర్లకు ఎంఆర్పి రేట్ లతోపాటు ప్రభుత్వ అనుమతులు పొందాలని సూచించారు. నాసిరకం, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జి ఓ నెంబర్ 42,50,51 లను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి :టీఎన్ఎస్ఎఫ్, బాపట్ల



బాపట్ల ప్రజాపాలన బ్యూరో : బాపట్ల ఆర్ట్స్ సైన్స్ కాలేజిలో ఎయిడెడ విద్య యధావిధిగా కొనసాగించాలని జి ఓ నెంబర్ 42,50,51 లలో ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని లిటీఎన్ఎస్ఎఫ్ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు మొవ్వ శరత్ చంద్ర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా లిలిమొవ్వ శరత్ బాబు లి మాట్లాడుతూ ? ఎయిడెడ్ సంస్థలకు (పాఠశాలలు , జూనియర్ , డిగ్రీ కళాశాలలు) ప్రభుత్వం ఇచ్చే ఆర్డినెన్స్ ఏయిడెడ్ నిలిపి వేయాలని , వాటిని ప్రైవేట్ నిర్వహించు కోవాలని లేదా ప్రభుత్వనికి అప్పగించలని కోరుతూ ఏపి విద్యా చట్టం 1982 సెక్షన్ 93 కు సవరణ చేస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్ 12/2021 మరియ తదినతర ప్రభుత్వ ఉత్తర్వులు అన్ని రద్దు చేసి విద్యార్థుల కు నిరుద్యోగులకు మరియు ఉద్యోగుల ను కాపాడాలి.గడిచిన రెండున్నరేళ్లుగా ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. నాడు నేడు పేరుతో రూ.16వేల కోట్లు దోపిడీకి పాల్పడ్డారు. అమ్మ ఒడిని అందరికి ఇస్తామని సగం మంది విద్యార్థులకు ఇచ్చి అందులోను రూ.15వేలను కాస్త రూ.14వేలకు తగ్గించారు. ఈ ఏడాది అది కూడా అమలు చేయడం లేదు. ప్రైవేట్ విద్య సంస్థల లో చదవలేని పేద విద్యార్థులు చదువుకు దూరమే రాష్ట్ర వ్యాప్తిగా డ్రాప్ ఔట్ రేట్ ఎక్కువే అవడం , ఇది విద్య అనే ప్రాథమిక హక్కులను విద్యార్థులు దూరం అవుతారు . ఇది రాజ్యాంగ వ్యతిరేకం .ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కుర్రా ధనేంద్ర, ముజీభ్,సాయి,అనిల్, టి యన్ ఎస్ యఫ్ నాయకులు విద్యార్థిని విధ్యార్దులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత భవిష్యత్తుకు ఎదగాలంటే ఆలోచనా విధానం మారాలి : జేడీ వి.వి లక్ష్మీనారాయణ



కావలి,డిశంబర్ 17 ప్రజాపాలన ప్రతినిధి :విద్యార్థులు ఉన్నత భవిష్యత్తు ఎదగాలంటే వారి ఆలోచనా విధానంలో మార్పు రావాలని సీబీఐ మాజీ జేడీ వి.వి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మద్దూరుపాడు లో గల %ఎం% ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఒక కార్యక్రమానికి ముఖ్య అతిధి గా హాజరయ్యారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలని తెలియజేశారు. తాను చదివిన కళాశాలకే చీఫ్ గెస్ట్ గా రావాలని, తన ఆటోగ్రాఫ్ ప్రతి ఒక్కరు తీసుకునేలా ఉండాలని చెప్పారు. %ఐఎం% కళాశాల కార్యదర్శి దామిశెట్టి బాల సురేష్ బాబు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం లక్ష్మీనారాయణ సత్కరించారు.

# సమాజ ప్రగతికి ఎనలేని కృషి చేస్తున్న.. స్నేహా సంస్థలు

**స్నేహా సంస్థల 21వ వార్షికోత్సవం లో తెలంగాణ రాష్ట్ర బిసి కమీషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్**






(మొదటి పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ అన్న అంబేద్కర్ కాన్సెప్ట్ తో స్నేహా లోని పలు కంపెనీల లాభాలను స్నేహా క్లబ్ ద్వారా సమాజ సేవకు ఉపయోగించడం అందులో భాగంగానే 12 కోట్ల రూపాయలు బహుజన విద్యార్థుల కొరకు,3300 మందికి గవర్నమెంట్ ఉద్యోగాల కల్పనలో చేయూత స్నేహా క్లబ్ కార్యక్రమాలలో కొన్ని మచ్చుతునకలు అన్నారు. రాబోయే కాలంలో బీసీ ని ముఖ్యమంత్రి గా చూడాలనే ఆశయంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికారసమితి పోరాటం చేస్తుందన్నారు. ఇండియా లో మొదటిసారిగా బహుజన యజమానులుగా ఉన్న మీడియా సంస్థ మాస్టర్ కీ,ప్రజాపాలన పత్రిక మాత్రమే అని అన్నారు. త్వరలో మాస్టర్ కీ శాటిలైట్ ఛానల్ గా తయారు కాబోతోందన్నారు.

**జెబి రాజు మాట్లాడుతూ..**

విశాఖపట్నానికి పరిమితమైన భాగ్యారావు భాగ్యనగరానికి రావడం భాగ్యనగర అదృష్టం అన్నారు. పే బ్యాక్ టు సొసైటీ అన్న అంబేద్కర్ స్ఫూర్తితో భాగ్యారావు పోరాటం చేస్తున్నారన్నారు. అంబేద్కర్ చివరి దశలో కన్నీరు కార్చిన ఘటన అందరి హృదయాలను ద్రవీభవిస్తుంది అన్నారు. ఆయన ఏ విషయం లో రాజీపడలేదు కాబట్టే మనం ఈ హక్కులు అనుభవిస్తున్నామన్నారు. గుడిసెల నుండి విద్యావంతులు అయిన వారు మిగతావారికి చేయూత అందించడం కొరవడిందన్నారు. పే బ్యాక్ టు సొసైటీ స్ఫూర్తితో స్నేహా క్లబ్ ను స్థాపించిన భాగ్యారావు మొదట పుస్తకాలు లేక చదువు ఆగకూడదు అని బహుజన పిల్లలకు చదువు చెప్పించడంతో ప్రారంభించారన్నారు. మాక్ అసెంబ్లీ వంటి కార్యక్రమాలతో బహుజనులకు అధికారం వస్తే ప్రగతి ఎలా ఉంటుందో చాటి చెప్పారన్నారు. ఉద్యోగాన్ని త్యజించి బహుజనులకు గొంతుకగా మీడియా ను నెలకొల్పాడన్నారు.

**శ్యామ్ సుందర్ మాట్లాడుతూ..**

స్నేహా గ్రూప్ ఆఫ్ కంపెనీలలో మొదటగా స్నేహా క్లబ్ ప్రారంభమైందన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో మొదట ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుంటున్న బహుజన విద్యార్థులకు పుస్తకాల పంపిణీతో మొదలై 17 లక్షల మంది విద్యార్థులకు 12కోట్ల రూపాయలు సహాయం అందించారన్నారు. మెడికల్ క్యాంపు లు,డెంటల్ క్యాంపులు వంటివి కోకొల్లలుగా నిర్వహించామన్నారు.

**ఆరేపల్లి రాజేందర్ మాట్లాడుతూ..**

బహుజన రాజ్య స్థాపనకై, బహుజనుల గొంతుకగా భాగ్యారావు మాస్టర్ కీ ఛానల్,ప్రజాపాలన పత్రిక స్థాపించడం జరిగిందన్నారు. పూలే అంబేద్కర్ రాజ్యాధికారసమితి బహుజనులను గొప్ప నాయకులుగా తయారు చేయడానికి దోహదపడుతుందన్నారు. బహుజనులు ఐక్యం గా పోరాడి రాజ్యాధికారం సాధించుకున్నప్పుడే నిజమైన స్వాతంత్ర్యం అన్నారు. నియోజకవర్గ వారిగా కంటెంట్ యజమానులు గా మాస్టర్ కీ ఛానల్ నడుస్తుందన్నారు.

ఈ సందర్భంగా స్నేహా గ్రూప్ సంస్థల డైరెక్టర్ లు స్నేహా పెళ్ళిపిలుపు - కె.బి.రాజు, స్నేహా మ్యాక్స్ - ఎస్.రామకృష్ణ,స్నేహా స్ఫూర్తి చిట్ ఫండ్ - కెన్నిబాబు , స్నేహా ఫార్మా ఈజీ - డాక్టర్ సుధాకర్, బహుజన బిజినెస్ పేజీస్ - కటికల క్రాంతి కుమార్, బహుజన బజార్ - రవిప్రసాద్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బహుజనులకు సేవలనందిస్తున్న పలు ఎన్. జి.ఓ ల అధినేత లను కటికల శివ భాగ్యారావు,వకుళాభరణం కృష్ణ మోహన్ లు కలసి ఘనంగా సన్మానించారు.










## గూండాలకు వాళ్లు రక్షణ ఇస్తే, మేము ఏరివేశాం: అమిత్‌షా

(మొదటి పేజీ తరువాయి)

ఆ రెండు పార్టీలు రాష్ట్రంలో గూండాలకు రక్షణ కల్పిస్తే, గూండాలను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏరివేశారని అన్నారు. బీజేపీ, నిషద్ పార్టీ సంయుక్తంగా లక్నోలో శుక్రవారంనాడు ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ఎస్పీ, బీఎస్పీలు కేవలం తమ కులాల కోసమే పనిచేశారని, బేజీపీ అందరి కోసం పనిచేసే పార్టీ అని చెప్పారు. వెనుకబడిన వర్గాల కోసం తాము పనిచేసినట్టు ఎస్పీ, బీఎస్పీ చెప్పుకుంటాయని, అయితే బీసీలకు రాజ్యాంగ గుర్తింపు విషయంలో ఎప్పుడూ పాటుపడలేదని అన్నారు. వెనుకబడిన తరగతుల వారికి రాజ్యాంగ హక్కులను బీజేపీనే కల్పించిందని చెప్పారు. తమ భాగస్వామ్య పార్టీగా ఉన్న నిషద్ పార్టీపైనా అమిత్‌షా ప్రశంసలు కురిపిచారు. నిషద్ కమ్యూనిటీ ఎజెండాలోని అంశాలకు బీజేపీ భరోసాగా నిలుస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన ప్రసంగంలో నిషద్ పార్టీతో పొత్తును స్వాగతించారు. 2019లోనూ నిషద్ పార్టీతో కలిసి పనిచేశామని, విపక్ష కూటమిని చిత్తుచేసి భారీ మెజారిటీ సాధించామని చెప్పారు. మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కలిసి పనిచేస్తున్నామని చెప్పారు.

## నేడే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ మరియు నిత్యవసర వస్తువుల ధరల తగ్గింపు పై నిరసన కార్యక్రమం ముఖ్యఅతిథిగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

బోనకల్ ,డిసెంబర్ 17 ప్రజా పాలన ప్రతినిధి: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోలు డీజిల్ ధరలు మరియు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య నిరుపేద ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోలు డీజిల్ మరియు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీ చేస్తున్న నిత్యావసర ధరల తగ్గింపు పై నిరసన పాదయాత్ర కు మద్దతుగా రేపు ది 18-12-2021న ఖమ్మం జిల్లా కేంద్రములోని కాలువ ఒడ్డున రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర నుండి జిల్లా పరిషత్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు పాద యాత్ర ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ పక్ష నేత భట్టి విక్రమార్క మల్లుహాజరవుతున్నారు. కావునమండల కాంగ్రెస్ నాయకులు,అనుబంధ సంఘ అద్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్లు,యం పి టి సి లు,జడ్ పి టి సి లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుచున్నాను.

## ప్రపంచ పెట్టుబడి దారులతో మోదీ సమావేశం..

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినప్పటి నుంచి అనేక సంస్కరణలను ఆవిష్కరించింది. గ్లోబల్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్‌లో భారతదేశాన్ని అధిరోహించడంలో ఎంతగానో సహాయపడింది. దేశాన్ని ఆటో మొబైల్స్ నుంచి సెమీకండక్టర్స్, సోలార్ రంగాల ఉత్పత్తుల తయారీ కేంద్రంగా మార్చేందుకు భారత్ కృషి చేస్తోంది.

## ఆ నీచానికి ఫుల్‌స్టాప్ పెట్టండి: ప్రియాంక

(మొదటి పేజీ తరువాయి)

ఖండనార్హమే. ఎంతమాత్రం సమర్ధనీయం కాదు. అత్యాచారం అత్యంత నీచమైన పని. ఫుల్‌స్టాప్." అని ప్రియాంక ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. దీనికి ముందు, రమేష్ కుమార్ సైతం తన వ్యాఖ్యలపై ఓ ట్వీట్‌లో క్షమాపణలు తెలిపారు.

"అసెంబ్లీలో నిర్లక్ష్యంగా చేసిన ప్రకటనకు గాను ప్రతి ఒక్కరికి నేను క్షమాపణలు చెప్పుకుంటున్నాను. అత్యాచారం వంటి నీచమైన నేరాన్ని తేలికగా తీసుకోవడం నా ఉద్దేశం కాదు. ఇకపై మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉంటా" అని ఆ ట్వీట్‌లో రమేష్ కుమార్ పేర్కొన్నారు.

## మరో రీమేక్ పై పవన్ కళ్యాణ్ ఆసక్తి




పవన్ కళ్యాణ్ మలయాళ చిత్రం అయ్యప్పనుమ్ కోషియుమ్కి రీమేక్ అయిన భీమ్లా నాయక్ లో నటిస్తున్న సంగతి తెలిసిందే. అన్నయ్య చిరంజీవి బాటలోనే పవన్ కళ్యాణ్ కూడా నడుస్తున్నారు. మెగాస్టార్ గాడ్ ఫాదర్– భోళా శంకర్ అనే రెండు రీమేక్ లు చేస్తున్నారు. రీమేక్ లు సురక్షితమని చిరు పవన్ భావిస్తున్నారు. ఇప్పుడు పవన్ మరో రీమేక్ లో నటించేందుకు అంగీకరించారని సమాచారం. వినోదయ సీతమ్ అనేది టైటిల్. సీనియర్ నటుడు సముద్రఖని నటించిన తమిళ చిత్రమిది. ఇది %బు% ప్లాట్ ఫారమ్ జీ5 ఒరిజినల్ చిత్రం. తమిళంలో విడుదలై ఆకట్టుకుంది. ఒరిజినల్ లో నటించి దర్శకత్వం వహించిన సముద్రఖని ఈ తెలుగు ప్రాజెక్ట్ కి మెగాఫోన్ పట్టనున్నారు. అయితే దీనిపై అధికారిక ధృవీకరణ వెలువడాల్సి ఉంది. పవన్ కళ్యాణ్ భీమ్లా నాయక్ సినిమాతో పాటు హరిహర వీరమల్లు చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. 12 జనవరి 2022న భీమ్లా నాయక్ విడుదల కానుంది. క్రిష్ జాగర్లమూడితో హరి హర వీర మల్లు మెజారిటీ చిత్రీకరణ పూర్తయింది. హరీష్ దర్శకత్వంలో భవదీయుడు భగత్ సింగ్ చేయాల్సి ఉంది. సురేందర్ రెడ్డితోనూ ఓ సినిమా చేయాల్సి ఉంది.

## ఇక దబిడి దిబిడే .. 'వేటపాలెం'లోకి బాలయ్య!



మొత్తానికి బాలకృష్ణ చాలా కాలం తరువాత తన స్థాయి హిట్ కొట్టాడు. 'అఖండ' సినిమాతో ఆయన పేరు అఖండ నామస్మరణగా మారిపోయింది. తమ హీరో బాడీ లాంగ్వేజ్ కి తగిన సినిమా ఇన్నాళ్లకి వచ్చిందని బాలయ్య అభిమానులు చెప్పుకుంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అసలు జనాలు థియేటర్లకు వస్తారా లేదా? అని అంతా సందేహంతో ఉండగా ఈ సినిమా రెండు వారాలకి పైగా థియేటర్లను దడదడలాడిస్తుండటం విశేషం. ఆడియన్స్ లో ఉన్న ఈ ఉత్సాహంతో మిగతా పెద్ద హీరోలు కూడా తమ సినిమాలతో థియేటర్లకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఇక ప్రస్తుతం బాలయ్య ఈ సినిమా సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్నారు. కొన్ని రోజులుగా భుజం నొప్పితో బాధపడుతున్న ఆయన త్వరలో గోపీచంద్ మలినేని సినిమాతో సెట్స్ పైకి వెళ్లనున్నారు. ఇప్పటికే పూజా కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా జనవరి 20వ తేదీ నుంచి రెగ్యులర్ షూటింగుకు వెళ్లనుంది. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేయనున్నారని అంటున్నారు. రాయలసీమ నేపథ్యంలో జరిగే ఈ కథలో బాలకృష్ణ ఫ్యాక్షన్ లీడర్ గాను పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ గాను కనిపించనున్నారని చెబుతున్నారు. ఈ రెండు పాత్రలు బాలయ్యకు కొట్టినపిండే. ఫ్యాక్షన్ లీడర్ పాత్రల్లో ఆయన విజృంభించారు .. పోలీస్ ఆఫీసర్ పాత్రల్లో రెచ్చిపోయారు. అలాంటి పాత్రల్లో చేసిన సినిమాలు ఆయనకి బాక్సాఫీస్ బొనాంజా అనే పేరు తెచ్చిపెట్టాయి. అలా తనకి మంచి పేరు తెచ్చిపెట్టిన రెండు పాత్రలలో ఆయన ఒకేసారి తెరపై కనిపించనున్నారన్న మాట. ఆయన సరసన నాయికలుగా శ్రుతి హాసన్ ను .. భావనను ఎంపిక చేసినట్టుగా తెలుస్తోంది. ఇక నెగెటివ్ షేడ్స్ కలిగిన పాత్రలో వరలక్ష్మి శరత్ కుమార్ కనిపించనుంది. ఆమె పాత్రను గోపీచంద్ మలినేని డిఫరెంట్ గా డిజైన్ చేశాడని చెబుతున్నారు. ఈ సినిమాకి 'వేటపాలెం' అనే టైటిల్ ను ఖరారు చేయనున్నట్టు చెబుతున్నారు. గతంలో ఆ ప్రాంతంలో జరిగిన ఒక యథార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'క్రాక్' సినిమాతో ఈ ఏడాది తిరుగులేని హిట్ ను అందుకున్న గోపీచంద్ మలినేని నుంచి వస్తున్న సినిమా కావడంతో అందరిలోను ఆసక్తి ఉంది. ఇక 'అఖండ' తరువాత బాలకృష్ణ చేస్తున్న సినిమా కావడం మరింతగా అంచనాలు పెంచడానికి కారణమవుతోంది. 'క్రాక్' సినిమాలో 'జయమ్మ' పాత్రలో అదరగొట్టేసిన వరలక్ష్మి శరత్ కుమార్ ఈ సినిమాలో ఏ రేంజ్ లో తన జోరు చూపిస్తుందో చూడాలి.

## రష్మిక ప్లాన్ వర్కవుట్ అయిందిగా



నాగశౌర్య నటించిన ఛలో సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది కన్నడ కస్తూరి రష్మిక మందన్న. ఈ మూవీ తో భలే వుందే పిల్లా? అని టాలీవుడ్ మేకర్స్ తో పాటు ఆడియన్స్ కూడా మెస్మరైజ్ అయ్యేలా చేసింది. ఆ తరువాత రౌడీ హీరో విజయ్ దేవరకొండతో చేసిన గీత గోవిందం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచి వంద కోట్ల క్లబ్ హీరోయిన్గా పేరు తెచ్చిపెట్టింది. ఆ వెంటనే భారీ చిత్రాల్లో క్రేజీ హీరోల సరసన నటించే ఆఫర్లని అందించింది. తన కెరీర్ కొత్త మలుపు తిరుగుతోందన్న విషయాన్ని వెంటనే గ్రహించిన రష్మిక బ్యాక్ టు బ్యాక్ మసూపర్ స్టార్ మహేష్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చిత్రాలతో పాటు బాలీవుడ్ లో రెండు క్రేజీ చిత్రాలని కూడా తన ఖాతాలో వేసుకుని పలువురు టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ లకు షాకిచ్చింది. వరుస విజయాల్ని తన ఖాతాలో వేసుకుంటూ నేషనల్ క్రష్గా పేరు తెచ్చుకున్న రష్మిక నటించిన పాన్ ఇండియా మూవీ పుష్ప : ది రైజ్. సుకుమార్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం పుష్ప చిత్రాలలో భాగంగా తొలి పార్ట్ గా ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా ప్రచారాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవాని పక్కా ప్లాన్ తో సిద్ధమైంది రష్మిక. ఈ చిత్రంలో డీ గ్లామర్ గా శ్రీవల్లి పాత్రలో నటించిన రష్మిక ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో మాత్రం ఓవర్ డోస్ గ్లామర్ ని ఒలికిస్తూ యెద అందాలతో థై షో చేస్తూ చేసిన రచ్చ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఈ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా బన్నీతో కలిసి రష్మిక హైదరాబాద్ బెంగళూరు చెన్నై కేరళ. ముంబైల్లో జరిగిన ప్రెస మీట్లలో పాల్గొంది. ఒక్కో ప్రెస్ మీట్ కి ఒక్కో తరహాలో డ్రెస్సింగ్ చేసుకుని అక్కడి మీడియాని ఎట్రాక్ట్ చేయడంలో వారి అటెన్షన్ ని గ్రాబ్ చేయడంలో రష్మిక నూటికి నూరుశాతం సక్సెస్ అయింది. ఓ ప్రెస్ మీట్ లో బ్లాక్ కలర్ శారీ స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి బ్యాక్ చూపిస్తూ రచ్చ చేసింది. ఆ తరువాత బ్లాక్ కలర్ టూ పీస్ డిజైనర్ వేర లో కనిపించి థై షో చేస్తూ హల్చల్ చేసింది. ఆ తరువాత గ్రీన్ కలర్ లెహెంగా ధరించి గ్లామర్ అందాలని విందు చేస్తూ హొయలు పోయంది. అంతేనా స్టేజ్ పై పుష్పలోని శ్రీవల్లి పాటకు స్టెప్పులేస్తూ వయ్యారాలు పోయింది. ఫైనల్ గా బ్లాకలర్ లెహెంగాడిజైనర్ వేర్ లో యెద అందాలని చూపిస్తూ ఫొటోలకి పోజులిస్తున్న సందర్భంలో కన్నగీటి కవ్వించినంత పని చేసింది. ఇదంతా పాన్ ఇండియా స్థాయిలో తనపై అటెన్షన్ క్రియేట్ కావడం కోసమే రష్మిక ఈ స్థాయిలో రచ్చ చేసిందట. ఈ విషయం తెలిసిన వాళ్లంతా రష్మిక ప్లాన్ బాగానే వర్కవుట్ అయ్యిందిగా అంటూ సెటైర్లు వేస్తున్నారు. ఇదంతా బాలీవుడ్ ని ప్రసన్నం చేసుకోవడం కోసమేనని కామెంట్ లు వినిపిస్తున్నాయి.

## చిల్లింగ్ మూడ్ లో మహానటి కళావతి



తమిళ చిత్రాలతో మెల్ల మెల్లగా ఇండస్ట్రీకి పరిచయం అయిన ముద్దుగుమ్మ కీర్తి సురేష్. ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ భారీగా ఉన్నా కూడా కొందరు రాణించలేక పోతున్నారు. కాని కీర్తి సురేష్ మాత్రం ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ తో ఇండస్ట్రీకి పరిచయం అయినా సొంతంగా ఉన్న బ్యాక్ గ్రౌండ్ మరియు ట్యాలెంట్ తోనే గుర్తింపు దక్కించుకుంది. మహానటి తర్వాత స్టార్ హీరోయిన్ గా పాన్ ఇండియా హీరోయిన్ గా ఈఅమ్మడు మారిపోయింది. మంచి అందంతో పాటు అభినయం కూడా మేళ్లవించిన కీర్తి సురేష్ వరుసగా సినిమాల్లో నటిస్తూనే ఉంది. సర్కారు వారి పాట చిత్రంలో మహేష్ బాబుకు జోడీగా కళావతి పాత్రలో నటిస్తున్న కీర్తి సురేష్ మరో వైపు తమిళంలో కూడా వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. భారీ ఎత్తున అంచనాలున్న సర్కారు వారి పాట చిత్రం షూటింగ్ ముగింపు దశకు వచ్చింది. ఈ సమయంలోనే కీర్తి సురేష్ స్పెయిన్ లో టైమ్ స్పెండ్ చేస్తున్నట్లుగా ఫొటోలు షేర్ చేసింది. హాలీడేస్ ను స్పెయిల్ లో చాలా ఉత్సాహంగా ఉల్లాసంగా ఫీల్ అవుతున్న కీర్తి సురేష్ మళ్లీ షూట్ లతో బిజీ అయ్యి సమ్మర్ వరకు తిరిగి లేకుండా షూటింగ్ ల్లో పాల్గొనబోతున్నట్లుగా తెలుస్తోంది. స్పెయిన్ ఈమద్య కాలంలో సెలబ్రెటీలు ఎక్కువగా వెళ్తున్న ప్రాంతం. అక్కడ కరోనా కేసులు తక్కువ ఉండటంతో పాటు ఆంక్షలు తక్కువగా ఉన్నాయి. కనుక అక్కడికే అందరు కూడా హాలీడేస్ ను ఎంజాయ్ చేసేందుకు వెళ్తున్నట్లుగా సోషల్ మీడియా టాక్. ఇక కీర్తి సురేష్ మహానటి సినిమా తర్వాత చేస్తున్న ప్రతి సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. ఆమె ప్రతి సినిమా కూడా జనాల్లో ఇంట్రెస్ట్ ను కలిగి ఉంది అనడంలో సందేహం లేదు. మహేష్ బాబుతో చేసిన సర్కారు వారి పాట మాత్రమే కాకుండా ఆ తర్వాత చేసిన.. అంతకు ముందు చేసిన సినిమాలు కూడా వచ్చే ఏడాది బ్యాక్ టు బ్యాక్ అన్నట్లుగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. తమిళం మరియు తెలుగు లోనే కాకుండా ఈ అమ్మడికి ఇతర భాషల్లో కూడా ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతానికి చల్లింగ్ మూడ్ లో ఉన్న ఈ మహానటి కళావతి కీర్తి సురేష్ మళ్లీ యాక్షన్ లోకి దిగితే ప్రేక్షకులు ఎగ్జైట్ ఫీల్ అవ్వడం ఖాయం.

## మెగాస్టార్ రూట్ మార్చేశారు...?



మెగాస్టార్ ఒక్కడే. ఎందరు స్టార్లు వచ్చినా ఆయనే ఒక నట శిఖరం. స్టార్ స్టాటస్ కి గౌరవం తెచ్చిన ఘనత ఆయనదే. చిరుగాలిగా చిరంజీవిగా ప్రయాణం మొదలెట్టి టాలీవుడ్ లో ప్రభంజనాన్ని సృష్టించి మెగా స్టార్ సింహాసనం ఎప్పటికీ తనదే అని గట్టిగా చాటి చెప్పిన క్రెడిట్ ఆయనదే. ఇక చిరంజీవి ఇపుడు మారిపోయారు అంటున్నారు. ఆయన తన కెరీర్ లో గతంలో ఎన్నడూ చేయని ప్రయోగాలు ఇపుడు చేస్తున్నారు. ఆయన స్టార్ డైరెక్టర్లను పక్కన పెట్టేశారు. వరసబెట్టి యంగ్ టాలెంట్ ని పిలిచి మరీ చాన్స్ ఇస్తున్నారు. ఆయన ఆచార్య సినిమాను పక్కన పెడితే తరువాత చేస్తున్న సినిమాలు అన్నీ కూడా యంగ్ డైరెక్టర్స్ తోనే. కొరటాల శివ తరువాత మళ్ళీ స్టార్ డైరెక్టర్స్ మాత్రమే చిరుని డైరెక్ట్ చేస్తారు అని అంతా అనుకుంటే ఆయన పిలిచి మరీ మెహర్ రమేష్ కి మెహర్ రాజాకి తనతో సినిమాలు చేసే చాన్స్ ఇచ్చేశారు. మెహర్ రాజా గురించి టాలీవుడ్ లో పెద్దగా ఎవరికీ తెలియదు కానీ ఆయన చిరుతో గాడ్ ఫాదర్ మూవీ చేస్తున్నాడు. ఇక మెహర్ రమేష్ చాన్నాళ్ళుగా సినిమా చేయడంలేదు. దానికి ముందు ఫ్లాప్స్ తో ఉన్నారు. అయినా చిరంజీవి ఆయనతో సినిమాకు ఓకే అనేశారు. వీరి కాంబోలో వేదాళం రీమేక్ గా భోళా శంకర్ సెట్స్ మీద ఉంది. ఇక బాబీ బ్లాక్ బస్టర్లు ఏమీ ఇవ్వలేదు కానీ చిరంజీవి ఆయనతో కూడా వాల్తేర్ శ్రీను మూవీ చేస్తున్నారు. ఇది చాలదు అన్నట్లుగా రెండు సినిమాలు మాత్రమే చేసిన వెంకీ కుడుములతో కూడా ఒక సినిమాకు కమిట్ అయ్యాడు. నిజానికి చిరంజీవితో సినిమాలు చేయాలని చాలా మంది స్టార్ డైరెక్టర్లు క్యూ కట్టి ఉన్నారు. వారిలో మొదటి పేరు చెప్పుకుంటే అది పూరీ జగన్నాథ్ దే అవుతుంది. అపుడెపుడో ఆటో జానీ మూవీ కథ చెప్పారు కానీ ఎందుకో ఆగింది. చాన్స్ వస్తే దాన్ని మించి స్టోరీతో చిరుని డైరెక్ట్ చేయాలని ఆయన చూస్తున్నారు. ఇక త్రివిక్రమ్ శ్రీనివాస్ తో మూవీ ఒకటి ఉంటుదని చిరంజీవే ఒక సినీ ఫంక్షన్లో అప్పట్లో చెప్పారు. అలాగే బోయపాటి శ్రీనుతో కూడా చిరంజీవి చేయాల్సి ఉందని టాక్. మరి స్టార్ డైరెక్టర్స్ చాలా మంది క్యూలో ఉండగా కొత్తవారికి యంగ్ డైరెక్టర్స్ కి చిరు చాన్సులు వరసబెట్టి ఇవ్వడం నిజంగా విశేషమే అంటున్నారు. అయితే చిరంజీవి లెక్క వేరుగా ఉందిట. కొత్త వారితో సినిమా అంటే కసిగా చేస్తారని వారితో కలసి చేయడం తనకు కూడా బూస్టింగ్ గా ఉంటుందని కొత్త ఎనర్జీ వస్తుందని భావిస్తున్నారుట. ఇక ఇపుడు చిరుతో సినిమా చేయాలీ అంటే స్టార్ కిరీటం అక్కరలేదు టాలెంట్ ఉండి మంచి కథ తో మెప్పిస్తే చాలు మెగాస్టార్ ఓకే అనేస్తారు అంతే.

## తన షోకి ఆల్ టైం బెస్ట్ రేటింగ్ సెట్ చేసి పెట్టిన తారక్.!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ సిల్వర్ స్క్రీన్ పైనే కాకుండా స్మాల్ స్క్రీన్ పై కూడా సూపర్ హిట్ అయ్యిన సంగతి అందరికీ తెలుసు. అప్పుడు తెలుగు బుల్లితెర అతిపెద్ద రియాలిటీ షో బిగ్ బిగ్ బాస్ కి హోస్ట్ గా వచ్చి రికార్డు టీఆర్పీ రేటింగ్ సెట్ చేసిన యంగ్ టైగర్ మళ్ళీ చాలా కాలం తర్వాత హోస్ట్ గా ఇంకో గ్రాండ్ రియాలిటీ షో "ఎవరు మీలో కోటీశ్వరులు" తో పలకరించారు. అయితే ఈ షోకి కూడా తనదైన శైలి హోస్టింగ్ తో రికార్డు రేటింగ్ ని రాబట్టాడు తారక్. అంతే కాకుండా ఈ సరి షో ముగింపు తో అసలు ఈ ఫ్రాంచైజ్ లోనే అధిక యావరేజ్ రేటింగ్ నమోదు అయ్యినట్టుగా తెలుస్తుంది. ఈ షోకి గాను మొత్తం ఇప్పటి వరకు జరిగిన ఎపిసోడ్స్ రేటింగ్స్ తో కలిపి యావరేజ్ గా 4.04 రేటింగ్ వచ్చిందట. ఇది ఈ షో ఫ్రాంచైజ్ లోనే ఆల్ టైం అధికం అని తెలుస్తుంది. మరి దీనికి కారణం ఎంతో ఆహ్లాదంగా రక్తి కట్టించిన తారక్ వలనే అనే చెప్పాలి.






Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com